జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | మంగళవారం 13 అక్టోబర్ 2026 | సంపుటి : 01 | సంచిక :270 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

**WANTED**

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి చతుష్పాద

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## ముగిసిన జంతర్ మంతర్ శకం

- చారిత్రక పోరాటాలకు సజీవ సాక్ష్యం
- 1993 జైల్ భరో కార్యక్రమం నుంచి 2026 నీట్ పేపర్ లీకేజీ వివాదాల వరకు ఎన్నో కీలక ప్రజా ఉద్యమాలకు జంతర్ మంతర్ వేదికైంది
- ఇప్పుడు కేంద్ర హోంశాఖ ఆదేశాలతో ప్రస్థానం ముగిసిపోయింది.

# మారనున్న తిరుపతి స్వరూపం

- వేల కోట్ల ప్రాజెక్టులకు చంద్రబాబు శంకుస్థాపన
- తిరుపతిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధికి ఆమోదం
- భక్తుల సమాచారం కోసం 'వెంకటాద్రి యాప్'ను ఆవిష్కరించిన ముఖ్యమంత్రి
- నగరంలో రూ.242 కోట్లతో 9 మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణానికి శ్రీకారం



**అమరావతి**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతి అభివృద్ధిలో మరో కీలక అధ్యాయం మొదలైంది. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో సుమారు రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శ్రీకారం చుట్టారు. అమరావతి సచివాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భక్తులకు సమగ్ర సమాచారం అందించేందుకు రూపొందించిన 'వెంకటాద్రి' యాప్‌ను కూడా సీఎం ఆవిష్కరించారు. ఈ వర్చువల్ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈఓ ఎం. రవిచంద్ర, పాలకమండలి సభ్యులు, తిరుపతి జిల్లా కలెక్టర్, 'తుడా' అధికారులు పాల్గొన్నారు. తిరుమలపై రద్దీని తగ్గించి, భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అలిపిరి వద్ద భారీ ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. - మిగతా3లో



## ఆరు రాష్ట్రాలు.. కొత్త బాధ్యతలు

- కేంద్రం కీలక నిర్ణయం..
- ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు!
- కేరళ నుంచి తమిళనాడుకు అర్లేకర్ బదిలీ..
- కేరళ గవర్నర్‌గా ఓం ప్రకాశ్ మాథూర్
- కర్ణాటక, ఒడిశా, ఉత్తరాఖండ్, సిక్కింలకూ కొత్త నియామకాలు

**న్యూఢిల్లీ**

దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు కేరళ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు సంబంధించి గవర్నర్ల నియామకాలు, బదిలీలపై రాష్ట్రపతి భవన్ ప్రకటన విడుదల చేసింది. ఈ మార్పుల్లో భాగంగా ఇప్పటికే గవర్నర్లుగా పనిచేస్తున్న కొందరికి ఇతర రాష్ట్రాల బాధ్యతలు అప్పగించగా, - మిగతా3లో




## బంగాళాఖాతంలో అల్పపీడనం

- దక్షిణ కోస్తా, రాయలసీమకు భారీ వర్ష సూచన
- దక్షిణ అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం
- రానున్న రోజుల్లో అల్పపీడనంగా మారే అవకాశం
- అక్టోబర్ 14 నుంచి దక్షిణ కోస్తాంధ్ర, తమిళనాడులో భారీ వర్షాలు
- రాయలసీమ, కేరళ, కర్ణాటకలోనూ విస్తారంగా వానలు కురిసే సూచన
- ఈశాన్య రుతుపవనాల రాకకు అనుకూల పరిస్థితులు

## భారత్‌లోకి చొరబడేందుకు యత్నం

- మందుపాతర పేలి లష్కరే కీలక కమాండర్ సహా నలుగురు ఉగ్రవాదులు మృతి!
- కృష్ణ ఘాటీలో మందుపాతరల పేలుడులో నలుగురు ఉగ్రవాదులు మృతి
- మృతుల్లో లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ ఫైజాన్ ఉన్నట్లు సమాచారం
- పూంఛ్ జిల్లాలో ఎల్ఓసీ వెంబడి భద్రత కట్టుదిట్టం
- సత్వాల్-నాకి ప్రాంతంలోనూ పేలుడు కలకలం



## రాజ్యాంగ సంస్థలను దూషించడం దారుణం

- కాంగ్రెస్ ఓ దిశానిర్దేశం లేని పార్టీ
- సీఈసీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు నిరసన చేపట్టడంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పందన
- రాజ్యాంగ సంస్థలను బహిరంగంగా దూషించడం సరికాదు
- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది



## విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర ప్రమాదం



- నలుగురు సజీవ దహనం!
- ఈవీ కారులో మంటలు చెలరేగి నలుగురి దుర్మరణం..
- మరొకరి పరిస్థితి విషమం
- రోడ్డు రెయిలింగ్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనా..
- ఘటనపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి

**విజయవాడ**

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎలక్ట్రిక్ వాహనం (ఈవీ)లో మంటలు చెలరేగడంతో నలుగురు సజీవ దహనమయ్యారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. నంబూరులో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగినట్లు సమాచారం. ఒకే కుటుంబానికి చెందినవారు సహా నలుగురు ప్రాణాలు - మిగతా3లో



## కోర్టు పరిశీలనలో ఉన్న అంశాలపై సమావేశం నిర్వహించడం న్యాయ నైతికతకు విరుద్ధం

- కాంగ్రెస్ సీనియర్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ లేఖ
- 'సుప్రీంకోర్టుకు ఆ విషయంలో ఎలాంటి అధికారాల్లేవ్'
- "న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించడం అనుచితం
- అలాగే, ఆయా అంశాలపై కోర్టులో భౌతికంగా లేదా ఆన్‌లైన్ ద్వారా పిటిషన్ దాఖలు చేయాలి

# ఏపీలో స్థానిక సమరం

- మేయర్, మున్సిపల్ పీఠాల రిజర్వేషన్లు ఖరారు!
- 17 కార్పొరేషన్లు.. 106 మున్సిపాలిటీలకు రిజర్వేషన్లు ప్రకటించిన ప్రభుత్వం
- మేయర్ స్థానాల్లో బీసీలకు 5, ఎస్సీలకు 2, ఎస్టీకి ఒకటి.. జనరల్ మహిళలకు 5
- మున్సిపల్ అధ్యక్ష పీఠాల్లో బీసీలకు 36, ఎస్సీలకు 14
- ఎన్నికల షెడ్యూల్‌పై ఉత్కంఠ




**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి రంగం సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మేయర్, చైర్‌పర్సన్ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ స్థానాలతో పాటు 106 మున్సిపాలిటీల అధ్యక్ష పీఠాలకు రిజర్వేషన్లు ప్రకటించింది. పురపోరుకు సంబంధించి షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఈ కేటాయింపులు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. ఏ పట్టణంలో ఏ సామాజిక వర్గానికి అవకాశం దక్కిందనే అంశంపై ఆశావహులు, రాజకీయ పార్టీలు లెక్కలు వేసుకుంటున్నాయి. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్ల మేయర్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేసింది. బీసీలకు ఐదు స్థానాలు కేటాయించగా, ఎస్సీలకు రెండు, ఎస్టీకి ఒక స్థానం దక్కింది. జనరల్ మహిళలకు ఐదు స్థానాలు - మిగతా3లో

## ఆసుపత్రుల బిల్లులపై కేంద్రం సీరియస్

- వైద్య సేవల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం కీలక నిర్ణయం
- ఆసుపత్రుల్లో చికిత్స చార్జీలను స్పష్టంగా ప్రదర్శించాలని రాష్ట్రాలకు ఆదేశం
- రోగులు ముందే ఖర్చుపై అంచనా వేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదం
- క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం ఈ నిబంధనలు అమలు చేయాలని సూచన
- విదేశీ రోగులకు అందించే ప్యాకేజీ రేట్లను కూడా ప్రదర్శించాలని విజ్ఞప్తి



## మహిళలకు అండగా సఖీ కేంద్రం

**బాపట్లలో నూతన భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు**



**బాపట్ల అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ఆపదలో ఉన్న మహిళలకు అండగా నిలిచి, వారికి అవసరమైన రక్షణ, వైద్య, న్యాయ సేవలను ఒకే వేదికపై అందించేందుకు సఖీ వన్‌స్టాప్ సెంటర్ ఉపయోగపడుతుందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ వెనుక సుమారు 60 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన సఖీ కేంద్ర భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. హింస, వేధింపులకు గురైన మహిళలు సహాయం కోసం ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడకుండా సఖీ కేంద్రాలు అండగా నిలుస్తాయన్నారు. బాధిత మహిళలకు వైద్య సహాయం, న్యాయపరమైన తోడ్పాటు, మానసిక కౌన్సిలింగ్‌తో పాటు అవసరమైన సమయంలో తాత్కాలిక ఆశ్రయం కల్పించడం ఈ కేంద్రం ముఖ్య ఉద్దేశమని వివరించారు. మహిళల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, బాధితులకు సకాలంలో సహాయం అందించి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన భవనంలోని కౌన్సిలింగ్ గదులు, వైద్య సహాయ విభాగం, ఇతర సదుపాయాలను ఎమ్మెల్యే పరిశీలించారు. కేంద్రానికి వచ్చే బాధిత మహిళలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**నేరణికి తండా, నేరణికి, ఎల్లార్తి గ్రామాల్లో పర్యటించిన హోళగుంద ఎస్ఐ, ఎంపీడీవో**



**హోళగుంద, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి న్యూస్ –** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను హోళగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ గురజాల, ఎంపీడీవో సయ్యద్ ఉమర్ పరిశీలించారు. నేరణికి తండా, నేరణికి, ఎల్లార్తి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, కేంద్రాల ప్రాంగణాల్లో చేపట్టాల్సిన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో భద్రతా ప్రమాణాలు, అవసరమైన సౌకర్యాలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మధుసూదన చక్రవర్తి, పిడిఓ రంగస్వామి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## మరమ్మత్తులతో కొత్త రూపు..

**హొళగుంద మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం పునఃప్రారంభం**

**కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పిలుపు**



**హొళగుంద, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి న్యూస్ –** హొళగుంద మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి మరమ్మత్తులు చేపట్టి, పనులు పూర్తయిన అనంతరం నూతనంగా తీర్చిదిద్దిన కార్యాలయాన్ని సోమవారం పునఃప్రారంభించారు. ఆధునికంగా, సౌకర్యవంతం గా కార్యాలయాన్ని పునరుద్ధరించడంతో విద్యాశాఖకు సంబంధించిన పరిపాలనా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుకలగనుంది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సుధారాణి, కబీర్ సాబ్,రిటైర్డ్ ప్రధానోపా ధ్యాయులు, ఎం.ఆర్.సి. సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, అకడమిక్ ఇన్స్ట్రక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయ పునరుద్ధరణపై వారు సంతోషం వ్యక్తం చేశారు. విద్యాశాఖకు సంబంధించిన వివిధ పరిపాలనా పనులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, విద్యా కార్యక్రమాల సమన్వయానికి నూతనంగా పునరుద్ధరించిన కార్యాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు.

## ఎస్సీ కార్పొరేషన్కు నిధులు కేటాయించాలి.

**గత ప్రభుత్వం రద్దు చేసిన 26 దళిత పథకాలను ప్రవేశ పెట్టాలి**

**మాల మహానాడు జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి కోరారు**



**నంద్యాల:అక్టోబర్=12** ప్రజాజ్యోతి సోమవారం నాడు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులు బాల వీరాంజనేయులు ఒంగోలు పట్టణంలో తన స్వగృహంలో కలిసి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ గత ప్రభుత్వం రద్దు చేసిన 26 దళిత పథకాలను ప్రవేశపెట్టాలని మరి ముఖ్యంగా బ్యాంకు లింకేజీ భూమి కొనుగోలు పథకం ఎం ఎస్ ఎఫ్ డి సి పథకం ఏపీ స్టడీ సర్కిల్ సెంటర్ పునరుదించాలని కోరారు ఈ కార్యక్రమంలో మాలమహానాడు నంద్యాల జిల్లా కార్యదర్శి కే శివుడు మాల మహానాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొలిమిగుండ్ల మండల నాయకుడు స్వామి దాసు తదితరులు పాల్గొన్నారు

## మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ను మర్యాదపూర్వకంగా కలిసిన గౌరు వెంకట్‌రెడ్డి



**నంద్యాల :అక్టోబర్ =12** ప్రజజ్యోతి నంద్యాల మంత్రి గారి క్యాంపు కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండీ ఫరూక్ ని మరియు టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ గార్లను నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు, నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి గౌరు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు ఉమ్మడి జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం మరియు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, నియోజకవర్గాల్లో సమన్వయం తదితర అంశాలు వీరి చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి.

## శ్రీఅరుణాచలేశ్వరస్వామి సన్నిధిలో నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.

**అరుణాచల గిరి ప్రధక్షణలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కుటుంబ సభ్యులు.**









**నంద్యాల:అక్టోబర్=12** ప్రజాజ్యోతి తమిళనాడు రాష్ట్రంలోని తిరుణామలై శ్రీఅరుణాచల క్షేత్రంలో సోమవారం నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి, ఆమె భర్త డాక్టర్ శివ చరణ్ రెడ్డి, తల్లీ బైరెడ్డి భారతమ్మ తదితర కుటుంబ సభ్యులు భక్తి శ్రద్దలతో శ్రీ అరుణాచల గిరి ప్రదక్షిణ చేసి, శ్రీ అరుణాచలేశ్వర శివయ్యను దర్శించు కుని, స్వామివారి దివ్య ఆశీస్సులు పొందారు. అరుణాచల ఆలయం సందర్శించి, కాలినడకన సుమారు 16 కిలోమీటర్లు దూరం పాదయాత్రతో గిరి ప్రధక్షిణ ఎంతో ఆనందంగా, అదృష్టంగా భావిస్తున్నానని, ఆ అరుణాచలేశ్వరుని కరుణాకటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, సంతోషం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## నిధులు మంజూరు చేయడం పట్ల హర్షణీయం

**కుక్కునూరు,ప్రజా జ్యోతి,అక్టోబర్ 12 :** మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి కోసం ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్ గారు రూ.1.55 లక్షల (కోటి 55 లక్షల) నిధులు మంజూరు చేయడం,పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి,ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు గారు రూ.60 లక్షల నిధులు మంజూరు చేయడం పట్ల కుక్కునూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) హర్షం వ్యక్తం చేశారు. కుక్కునూరు మండలంలోని గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ,ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన వసతులు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి,కూటమి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం,గ్రామీణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగడం సంతోషకరమని అన్నారు. కుక్కునూరు మండల అభివృద్ధికి సహకరిస్తూ నిధులు మంజూరు చేసిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ కి,పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు) తెలిపారు.

## ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌తో వరుపుల సుబ్బారావు భేటీ..

**ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చ..**



**శంఖవరం: అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి న్యూస్)** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించేందుకు ప్రత్తిపాడు మాజీ శాసనసభ్యులు, జనసేన పార్టీ ప్రత్తిపాడు అసెంబ్లీ సమన్వయకర్త వరుపుల సుబ్బారావు కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడలోని ఎంపీ కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు, స్థానికంగా ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నాయకులు చర్చించినట్లు తెలిసింది. ప్రజా సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ, సంబంధిత అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరాన్ని నాయకులు ప్రస్తావించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కీలకమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలని ఈ భేటీ సందర్భంగా అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పించడం, స్థానిక సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడం వంటి అంశాలపై నాయకుల మధ్య చర్చలు జరిగినట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన ఆవశ్యకతను ఈ సమావేశం తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మాజీ శాసనసభ్యులు, జనసేన పార్టీ ప్రత్తిపాడు అసెంబ్లీ సమన్వయకర్త వరుపుల సుబ్బారావుతో పాటు జనసేన నాయకులు గొర్లి నాగేశ్వరరావు, వరుపుల సత్య సూరిబాబు, మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న జనసేన నేత తలపంటి బుజ్జి మృతురాలి కుటుంబానికి బియ్యం, ఆర్థిక సాయం



**శంఖవరం, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి న్యూస్)** శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన చిట్టుమూరి రావయ్యమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న శంఖవరం మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, తన సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులైన చిట్టుమూరి ప్రభుదాస్, చిట్టుమూరి ప్రియ, చిట్టుమూరి కామరాజు, చిట్టుమూరి చిన్నయ్యమ్మ తదితరులను కలిసి ఓదార్చారు. కుటుంబానికి అవసరమైన సహాయంగా 50 కిలోల బియ్యంతో పాటు ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ద్వారా మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శివకోటి ప్రసాద్, నొక్కి వీరబాబు, కోరాడ జానుబాబు, కానేటి అభి, కోటిపల్లి నీలకంఠం, మోసి, తలపంటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## చొప్పెల్ల గ్రామంలో డ్రోన్‌తో మహాలక్ష్మి చెరువు, గరువు గొయ్యి లలో కలుపు మందు పిచికారీ చేయించిన పంచాయతీ సెక్రటరీ.



**ఆలమూరు అక్టోబర్ 12(ప్రజాజ్యోతి):** ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామ పరిధిలోని మహాలక్ష్మి చెరువు,గరువు గొయ్యి ప్రాంతాల్లో విస్తరించిన తూటికాడ కలుపు మొక్కల నివారణకు పంచాయతీ సెక్రటరీ పాలంగి రాజు కూటమి నాయకుల సమక్షంలో సోమవారం డ్రోన్ ద్వారా కలుపు మందు పిచికారీ చేయించినారు. సాధారణ పద్ధతుల్లో కలుపు మొక్కలను తొలగించడం కష్టంగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ సాంకేతికతను వినియోగించడం ఈ చర్యలో ప్రధాన అంశంగా నిలిచింది. గ్రామ పరిధిలోని మహాలక్ష్మి చెరువు,గరువు గొయ్యి ప్రాంతాల్లో తూటికాడ కలుపు మొక్కలు,తుప్పలు విస్తరించడంతో వాటి నియంత్రణ కోసం ఈ చర్య చేపట్టినట్లు,తరువాత ఇదే విధంగా గ్రామంలోని పాము గొయ్యను కూడా శుభ్రం చేయిస్తామని సెక్రటరీ తెలిపారు. కూలీలతో నేరుగా వెళ్లి మందు పిచికారీ చేయడం కష్టతరంగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ వినియోగం ద్వారా పని చేపట్టడం వల్ల శ్రమ, సమయం ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బళ్ల హరికృష్ణ, సుంకర శ్రీరాములు, నాగిరెడ్డి స్వామి, మద్ది సతీష్,నాగిరెడ్డి మహేష్, పల్ల రామకృష్ణ,సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ మొగిలి వంశీకృష్ణ,డ్రోన్ ఆపరేటర్,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు.



**ఆలమూరు అక్టోబర్ 12(ప్రజాజ్యోతి):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామంలోని శ్రీ కొండాలమ్మవారి గుడి సెంటర్ వద్ద జాతీయ రహదారి పక్కన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి భారీ విగ్రహాన్ని నిర్మించేందుకు వాల్మీకి సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సన్నాహాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సోమవారం వాడపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక చొప్పెల్ల గ్రామ టిడిపి నాయకులతో కలిసి శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావునుమర్యాదపూర్వకంగా కలిశారు. జాతీయ రహదారి పక్కన చొప్పెల్ల గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి భారీ విగ్రహాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు ఎమ్మెల్యేకు వివరించి,నిర్మాణం చేయబోయే శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామివారి విగ్రహ నమూనాను ఎమ్మెల్యే బండారు కు అందజేసి, విగ్రహ నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరయ్యేలా సహకరించాలని వారిని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సానుకూలంగా స్పందిస్తూ, ఇది దైవ కార్యక్రమం కావడంతో తప్పనిసరిగా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పెల్ల గ్రామ టీడీపీ నాయకులు బళ్ల హరికృష్ణ, మద్ది సతీష్,తోరాటి సుబ్రమణ్యం,సుంకర కామరాజుతో పాటు విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు గుండుపోగుల వరప్రసాద్, మురకొండ సూరిబాబు, సుంకర సాయి, జి. శ్రీను, జి. గణేష్, పి. అంజి, సీహెచ్. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో అత్యాధునిక 'శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' ఘనంగాప్రారంభం

**ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**నంద్యాల :అక్టోబర్ =12 ప్రజాజ్యోతి** నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ సమీపంలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ డి. శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ డి. కీర్తి రెడ్డి ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన "శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్" సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ రెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ "నంద్యాల పట్టణంలో అత్యాధునిక వసతులతో 'శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' ఏర్పాటు కావడం ఎంతో అభినందనీయమన్నారు . గతంలో తీవ్రమైన కిడ్నీ, యూరాలజీ సమస్యలొస్తే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్, కర్నూలు లేదా బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని . ఇప్పుడు అలాంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు స్థానికంగానే నంద్యాల ప్రజల చెంతకు రావడం సంతోషకరమన్నారు . యువ వైద్యులైన డాక్టర్ డి. శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ డి. కీర్తి రెడ్డి లు ఉన్నత వైద్య విద్యను అభ్యసించి, తమ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఈ ఆసుపత్రిని ప్రారంభించడం హర్షణీయమైన విషయం అన్నారు . పేద, మధ్యతరగతి ప్రజలకు భారం కాకుండా మానవతా దృక్పథంతో, నాణ్యమైన వైద్యాన్ని అందించాలని కోరుతున్నానని తెలిపారు . శ్రీ ధన్వి హాస్పిటల్ ప్రజల మన్ననలు పొందుతూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, వైద్యుల బృందానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ డి. శ్రీకాంత్ రెడ్డి (యూరాలజిస్ట్), డాక్టర్ డి. కీర్తి రెడ్డి (నెఫ్రాలజిస్ట్) మాట్లాడుతూ "నంద్యాల పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో 'శ్రీ ధన్వి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్'ను స్థాపించడం జరిగిందని తెలిపారు . ముఖ్యంగా కిడ్నీ, మూత్రపిండాల సంబంధిత వ్యాధులకు అధునాతన పరికరాలు, నిపుణుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందిస్తామన్నారు. రోగుల అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 24 గంటల ఎమర్జెన్సీ సేవలతో పాటు, అధునాతన ల్యాబ్, ఫార్మసీ సేవలను కూడా ఒకే చోట సమకూర్చామన్నారు . పెద్ద నగరాలకు వెళ్లే పనిలేకుండా ఇక్కడే అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్యాన్ని సామాన్యులకు అందుబాటు ధరల్లో అందించడమే మా ప్రధాన ధ్యేయం అన్నారు . మా ఆసుపత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసి ఆశీస్సులు అందించిన గౌరవ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారికి, ఎమ్మెల్యే అఖిల ప్రియ గారికి , ఇతర అతిథులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు."ఈ కార్యక్రమంలో విద్యాసంస్థలు అధినేత మధుసూదన్ రెడ్డి , కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్, మాజీ కౌన్సిలర్ కండే శ్యాంసుందర్ లాల్, బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా, అనుపూర్ ఈశ్వర్, చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పసుపులేటి జనార్ధన్, డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు







## మంత్రాలయం నియోజకవర్గ సమన్వయకర్తగా కౌతాళం రామాంజినేయులు

**:-పన్నెండేళ్ల కష్టానికి ఫలితం**

**:-పార్లమెంటు కమిటీ నియోజకవర్గ సమన్వయకర్త గా రెండు పార్టీ పదవులు**

**:-జనసేన అధినాయకుడు కొడిదెల పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు తెలిపిన రామాంజినేయులు**







**కౌతాళం,అక్టోబర్ 12 ప్రజా జ్యోతి** గత పన్నెండేళ్ళుగా మంత్రాలయం నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యకర్తగా పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో గత ఎన్నికలలో కూటమి విజయానికి శక్తి వంచన లేకుండా పని చేసిన కౌతాళం మండల కేంద్రానికి చెందిన రామాంజినేయులు జనసేన మంత్రాలయం నియోజకవర్గ కమిటీలో ముగ్గురు సమన్వయకర్తలలో ఒకరిగా నియామకం అయ్యారు ప్రజా సంఘాల ఉద్యమాలలో పని చేస్తూ సినీహీరో మెగాస్టార్ చిరంజీవి అభిమానిగా పవన్ కళ్యాణ్ వీరాభిమాని గా ఉంటూ జనసేన ఆవిర్భావం నుండి జనసేన కార్యకర్తగా సేవ పార్టీ కార్యక్రమాలు చేస్తూ , జనసేన పార్టీ ఏ పిలుపునిచ్చినా కార్యక్రమం విజయవంతం కోసం పనిచేశారు.జిల్లా పార్లమెంటు కమిటీలో నియోజకవర్గ సమన్వయకర్తగా గతంలో పార్టీ నియమించిన పార్లమెంటు కమిటీలో సభ్యునిగా ప్రస్తుత నియోజకవర్గ కమిటీలో సమన్వయకర్తగా నియామంచడం వెనుక కార్యకర్తగా పడిన కష్టం పార్టీ అభివృద్ధి కై చేసిన పనికి వచ్చిన గుర్తింపు గా భావిస్తున్నట్లు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు రామాంజినేయులు జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు తెలుపుతున్నాను , భవిష్యత్తు లో పవన్ కళ్యాణ్ ఏ పిలుపు నిచ్చినా ఆ పిలుపు విజయవంతం కోసం నియోజకవర్గ, మండల గ్రామ నాయకులను కలుపుకొని, ఐకమత్యంతో పని చేస్తానని తెలిపారు.

## బి సి ల రాజకీయ సాధికారత... సి ఎం చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం



**హోళగుంద, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి న్యూస్ -** స్థానిక సంస్థల బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న చర్యలకు కృతజ్ఞతలు తెలుపుతూ హొళగుందలో టీడీపీ సీనియర్ నాయకుడు ఈబీజీ గోవింద్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా గోవింద్ గౌడ్,యువ నాయకుడు ఈబీజీ రాజేంద్ర గౌడ్ మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి,రాజకీయ సాధికారతకు టీడీపీ కట్టుబడి ఉందని తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్,ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ వైకుంఠం జ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# చరిత్రకారుడు శివనాగిరెడ్డిని కలిసిన బిసి రాజారెడ్డి



**బనగానపల్లె: అక్టోబర్=12 ప్రజాజ్యోతి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ స్థపతి, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి గారిని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్, అరుణ భారతి సాహితీ సంస్థ అధ్యక్షులు బిసి రాజారెడ్డి కలిశారు. హైదరాబాదులో శివనాగిరెడ్డి గారిని కలిసిన బిసి రాజారెడ్డి పురాతన, చారిత్రాత్మక సంఘటనకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... శివ నాగిరెడ్డి అనేక చారిత్రక , పురాస్థలాల తవ్వకాల్లో పాల్గొనడంతో పాటు ముంపునకు గురైన ఎన్నో పురాతన ఆలయాలను వెలుగులోకి తీసుకొచ్చి ఎగువకు తరలించి పునర్నిర్మించారన్నారు. చరిత్ర శాసనాలు, పురాతన స్థలాలు, కట్టడాలు, ఆలయాలు, బౌద్ధ, జైన స్థావరాలపై అనేక పుస్తకాలు రాశారన్నారు. మహాబలిపురం కి చెందిన పద్మశ్రీ వి.గణపతి స్థపతిచే వాస్తు శిల్పవాచస్పతి అనే బిరుదును పొందారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించే అత్యున్నత పురస్కారం కళారత్న అవార్డును సొంతం చేసుకున్నారని తెలిపారు. అలాగే తెలంగాణ సారస్వత పరిషత్ వారి సురవరం ప్రతాపరెడ్డి సాహితీ పురస్కారాన్ని సొంతం చేసుకున్నారన్నారు. చరిత్రకారుడు శివనాగిరెడ్డి గారినిని కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అలాగే తాను సేకరించిన పురాతన నాణేలు, పుస్తకాలు గురించి ఆయనకు వివరించగా అభినందించడం జరిగిందన్నారు. రాబోవు భవిష్యత్ తరాల వారికి అవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

బనగానపల్లె మండలం లోని జోలాపురం గ్రామానికి ఎంతో పూర్వ చరిత్ర ఉందని శివ నాగిరెడ్డి తెలిపారన్నారు. పూర్వం 71 వేల సంవత్సరాల కిందట ఇండోనేషియాలో అగ్నిపర్వతం పేలి దాని నుంచి వచ్చే లావా ప్రపంచంలోని పలు ప్రదేశాల్లో పడిందన్నారు. అందులో జోలాపురం గ్రామం ఒకటన్నారు. లావా పడే సమయంలో అక్కడ నివసించే చాలామంది యాగంటి కొండలపైకి వెళ్లి ప్రాణాలు రక్షించుకోగా మరికొందరు సజీవ దహనం అయ్యారని, వాటికి సంబంధించిన ఆధారాలు, జంతువులు, మానవ అవశేషాలు బయటపడ్డాయని వాటిని జాగ్రత్తగా కాపాడడం జరుగుతోందని శివనాగిరెడ్డి వివరించారు. బనగానపల్లె చుట్టుపక్కల ప్రాంతాలకు ఎంతో ఘన చరిత్ర ఉందని గుర్తు చేశారు. క్రీస్తుపూర్వం 4000 సంవత్సరాల క్రితం అవుకు మండలం రామాపురంలో భారత దేశంలోని మొట్టమొదటిసారిగా కంకర రోడ్డు వేసినట్లు చరిత్ర లో ఆధారాలు లభించాయని తెలిపారు. త్వరలోనే బనగానపల్లె ప్రాంతంలోని చారిత్రాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తానని శివనాగిరెడ్డి తెలిపినట్లు బిసి రాజారెడ్డి పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



**గుంతకల్లు అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, ఎన్నిక లు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందు కు గుంతకల్లు పట్టణ ప్రజలందరూ పోలీస్ మరియు మున్సిపల్ అధికారులకు సహకరించా లని గుంతకల్లు డీఎస్పీ బి. శ్రీనివాసరావు కోరారు. ఈ క్రమంలో సోమవారం గుంతకల్లు డీఎస్పీ బి. శ్రీనివాసరావు, గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి, గుంతకల్లు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీధర్, పోలీస్ మరియు మున్సిపల్ సిబ్బందితో కలిసి గుంతకల్లు పట్టణం లోని పలు మున్సిపల్ వార్డుల్లో ఉన్న పోలింగ్ లొకేషన్లు, పోలింగ్ కేంద్రాలు మరియు స్ట్రాంగ్ రూమ్‌ల ను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లు, తీసుకోవా ల్సిన ముందస్తు జాగ్రత్తలు, పోలింగ్ కేంద్రాల వద్ద కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించి, ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టేందుకు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగంలో నుండి తీసేసారనే కక్ష

**మరోవైపు డబ్బుల కోసం ఏదైనా చేయాలనే తెగింపు..!**

**దారుణానికి ప్లాన్ చేసిన సెక్యూరిటీ గార్డ్ విక్రమ్.. ఇందుకు మరో ఇద్దరి సహకారం**

**అందులో ఒకడు మరో సెక్యూరిటీ గార్డ్, స్థానికంగా పనిచేసే ఎలక్ట్రీషియన్..!**

**బొల్లారం చిన్నారి కిడ్నాప్, మర్డర్ కేసులో వెలుగులోకి కీలక అంశాలు**



**నంద్యాల:అక్టోబర్=12 ప్రజాజ్యోతి** పాపను కిడ్నాప్ చేసి.. మరో సెక్యూరిటీ గార్డ్ ఫోన్ నుండి పాప తండ్రికి కాల్ చేసిన విక్రమ్ ఇరవై లక్షలు డబ్బు డిమాండ్ చేసిన విక్రమ్ అయితే పెద్దలమాస బతుకమ్మ వేడుకలు ఉన్నందున.. కమ్యూనిటీ లో ఉన్నవాళ్ళు అందరు బయటికి రావడంతో దొరికిపోతామని భయపడిన విక్రమ్ అతనికి సహకరించిన ఇద్దరు కలిసి చిన్నారిని హతమార్చారు ప్రధాన హంతకుడు విక్రమ్ బాలికను హతమార్చగా.. ఎలక్ట్రీషియన్ పాప అరుపులు బయటకు వినపడకుండా.. బతుకమ్మ పాటల సౌండ్ పెంచాడు..! మరో సెక్యూరిటీ గార్డ్ ఎవరూ అక్కడికి రాకుండా కాపలా కాసాడు విక్రమ్ ప్రవర్తన బాగాలేదని వారం క్రితమే ఉద్యోగం నుంచి తొలగించిన ఇండ్ల కమ్యూనిటీ యజమానులు ఆ కక్షతోనే చిన్నారిని కిడ్నాప్ చేసి, ఆమె తండ్రిని డబ్బులు డిమాండ్ చేసేందుకు ప్లాన్ వేసిన విక్రమ్..!చిన్నారి తండ్రికి కాల్ చేసి డబ్బులు అడిగిన ఫోన్ నెంబర్ ట్రేస్ చేసిన పోలీసులు.. ఆ ఫోన్ మరో సెక్యూరిటీ గార్డు దగ్గర ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు..!విక్రమ్‌కు సహకరించిన మరో సెక్యూరిటీ గార్డు, ఎలక్ట్రీషియన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు

# బద్వేల్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి సీపీఐ సిద్ధం

**ప్రజా సమస్యలే అజెండాగా ఎన్నికల బరిలోకి దిగుతాం సీపీఐ నాయకులు**




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పోటీకి సిద్ధమవుతోందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్డమాను వీరశేఖర్, ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ తెలిపారు. సోమవారం బద్వేల్ లోని సీపీఐ ఏరియా సబ్‌కమిటీ సభ్యులతో ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. అనంతరం పట్టణ కార్యదర్శి బాలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. బద్వేల్ మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి బ్రహ్మసాగర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు నిధులు కేటాయించాలని పోరాటం చేసినట్లు తెలిపారు. అలాగే రైతులకు బ్రహ్మసాగర్ నీటిని అందించడం, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించడం, బ్రహ్మసాగర్ పిల్ల కాలువల నిర్మాణం, రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారంతో పాటు వీధికుక్కలు, పందుల సమస్యల నివారణకు కృషి చేసినట్లు వివరించారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఎన్నికల్లో పోటీ చేస్తామని నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడేందుకు సీపీఐ సిద్ధంగా ఉందని, మున్సిపాలిటీలో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించి ప్రజాసేవకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శులు పీవీ రమణ, ఇమ్మానియేల్, కోశాధికారి పడిగే వెంకటరమణ పాల్గొన్నారు.

## డీఎస్పీ శ్రీనివాసులుకు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి శుభాకాంక్షలు



**ఎమ్మిగనూరు, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** ఎమ్మిగనూరు సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఏ. శ్రీనివాసులు ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎస్పీ శ్రీనివాసులుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నేరాల నియంత్రణకు సమర్థవంతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

## కంచి కామాక్షి ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

**- గాయత్రి దేవి అవతారంలో భక్తులకు అమ్మవారి దర్శనం**



**పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్:** శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పొందూరు మండల కేంద్రంలో అగ్రహారం వీధిలో వెలసియున్న శ్రీ కంచి కామాక్షి ఆలయంలో రెండవ రోజు అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ప్రతీ ఏటా కంచి కామాక్షి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించడం విశేషం.ఇందులో భాగంగా సోమవారం నాడు పురోహితులు కూనపులి సూరిబాబు వేద మంత్రోర్చనలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు ,కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో కంచి కామాక్షి ఆలయ కమిటీ చైర్మన్ సింహాద్రి ధనుంజయ రావు దంపతులు , అధ్యక్షులు కొండపల్లి సూర్యనారాయణ దంపతులు , రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ , టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## జనసేన పార్టీలో చేరిన సీనియర్ బీసీ నాయకుడు పంపన రామకృష్ణ



**కాకినాడ (ప్రజా జ్యోతి)**కాకినాడ జిల్లాకు చెందిన ప్రముఖ సీనియర్ బీసీ నాయకుడు పంపన రామకృష్ణ సోమవారం జనసేన పార్టీలో చేరారు.జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పవన్ కళ్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా జనసేనలోకి ఆహ్వానించారు.అనంతరం కాకినాడ గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే పంతం నానాజీ నాయకత్వంలో, సీనియర్ జనసేన నాయకుడు నక్కా బద్రి, పంపన రామకృష్ణ ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా కృషి చేస్తామని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు...

## కన్నడోత్సవం--2026లో ప్రముఖ కవి జాజి దేవేంద్రప్పకు ప్రత్యేక గుర్తింపు

**అక్టోబర్ 17న మైసూరులో కన్నడోత్సవం..**

**పలువురు సాహితీ ప్రముఖుల సమక్షంలో వేడుకలు**

**హోళగుంద, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి న్యూస్ -** కన్నడ భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే లక్ష్యంతో దసరా ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 17న మైసూరులో కన్నడోత్సవం--2026 నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలో మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామానికి చెందిన ప్రముఖ కవి డా.జాజి దేవేంద్రప్ప పేరు చోటుచేసుకోవడం విశేషం.బి.ఎం.శ్రీ. సుభాషణ, కువెంపు కన్నడ అధ్యయన సంస్థ, మానసగంగోత్రి, మైసూరు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం 9 గంటలకు సుగమ సంగీత కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమై, 10.30 గంటలకు ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ వేడుకల్లో పలువురు సాహితీవేత్తలు, విద్యావేత్తలు, ప్రముఖులు పాల్గొననున్నారు. కన్నడ భాషా సాహిత్యాన్ని ప్రోత్సహించడం, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కవులు, సాహితీప్రియుల్లో ఆసక్తి ప్రముఖ కవి జాజి దేవేంద్రప్పకు సంబంధించిన ప్రస్తావనతో ఈ కన్నడోత్సవం సాహితీ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.. ఇంతటి మహోత్తర కార్యక్రమంలో ఎల్లార్తి గ్రామానికి చెందిన కవి డాక్టర్.జాజి దేవేంద్రప్ప కు స్థానం దక్కడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దుర్గాడ శివాలయంలో వైభవంగా దేవీ శరన్నవరాత్రి వేడుకలు: గాజుల గౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ లలితాదేవి



**గొల్లప్రోలు ప్రజా జ్యోతి** దుర్గాడ గ్రామంలోని ప్రసిద్ధ పురాతన శివాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారు "గాజుల గౌరీదేవి" మహాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ గాజుల గౌరీదేవి అలంకారం కోసం రంగురంగుల గాజులను ఉపయోగించారు. అమ్మవారిని రంగురంగుల గాజులతో అత్యంత నయనమనోహరంగా అలంకరించారు. ఈ అద్భుత రూపాన్ని దర్శించుకోవడానికి దుర్గాడ పరిసర పరిసర ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహిళలకు అమ్మవారి ప్రసాదంగా గాజులను పంపిణీ చేశారు. ఈ గాజులను ధరించడం వల్ల సౌభాగ్యం, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో దుర్గాడ శివాలయం భక్తి శ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది.

# సంకల్పం గొప్పదైతే అన్నీ ఆభగవంతుడే ఏర్పాటు చేస్తాడు!..







పాపం అప్పువంటిది!..
పుణ్యంపొదుపు వంటిది!..
నాజీవితం ప్రభువు సేవకే అంకితం!..
ఎఫ్.జె.సీ.సీ,చర్చి,సేవకులు పాస్టర్ యేసురత్నం!..

**వరరామచంద్రాపురం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** పాపం అప్పు వంటిది, పుణ్యం పొదుపు వంటిది, సమయం వచ్చినప్పుడు మనం పుణ్యం చేస్తే తప్పకుండా ఆదుకుంటుందని ఎఫ్.జె.సీ.సీ,చర్చి పాస్టర్ ఉంగుటూరి యేసురత్నం, స్పష్టం చేశారు. ఆదివారం ఎఫ్. జె.సీ.సీ.చర్చి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఘనంగా,చర్చి ఆవరణలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.పేదలకు అన్నదానం, వృద్ధులకు వస్త్రధానం, గర్భిణీ స్త్రీలకు "మెడికల్ చెకప్"ఉచిత మెగా హెల్త్ క్యాంపు, నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో మనిషి సమూలంగా మార్పుదిశగా అడుగులు వేయాలని, పిలుపునిచ్చారు. సహాయం చేసే సహజ తత్వానికి మానవ జీవితం పునరాంకితం కావాలని కోరారు. ఆపదలో ఉన్నవారికి చిన్నసహాయం.కష్టంలో ఉన్నవారికి ఓదార్పు,అనే అంశాలపై అవగాహన ఉంటే,ఏమనిసైనా సమాజంలో సంపూర్ణిడిగా వృద్ధిలోకి వస్తారని, వివరించారు. సహాజత్వానికి దగ్గరగా, ప్రేమను పంచే మార్గాన్ని నిర్దేశించుకొని మానవాళికి ఉపయోగపడే వ్యక్తి గా ఉండాలనే సంకల్పంతో ప్రతీఒక్కరూ జీవించాలని కోరారు.

**ఎఫ్.జె.సీ.సీ,చర్చిఆవిర్భావ దినోత్సవం,సందర్భంగా!..**

**ప్రతీఏడాది సేవా కార్యక్రమాలు నిర్వహిస్తాం!..**

భగవంతుడు ఇచ్చినదాన్ని ప్రజలసేవకోసం ఖర్చు చేయడంలో ఉన్న సంతోషం ఎన్ని జన్మలెత్తినా చూసేఅవకాశం రాదని ఎఫ్. జె.సీ.సీ,చర్చి పాస్టర్ యేసురత్నం, వివరించారు. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన అంశాలను పంచుకున్నారు. సహాయం చేయాలనే సంకల్పం ఉంటే భగవంతుడు ఆసమయానికి అన్నీ ఆయనే సమ కూరుస్తారని, అలాంటి అద్భుతాన్ని ఆప్రభువు చేస్తారని నేను విశ్వశిస్తున్నాన్నన్నారు. ఆయన చేసే ప్రతీ కార్యం గొప్పగా ఉంటుందని, నేను మనస్ఫూర్తిగా విశ్వాసం వ్యక్తం చేస్తున్నానన్నారు. ఆయన పిలుపు మేరకు సేవా కార్యక్రమాలు నిర్వాహిస్తున్నట్లు చెప్పారు. వస్త్రధానం, అన్నదానం, చేస్తే ఆభగవంతుడు మన కుటుంబానికి అండగా నిలుస్తాడాని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతీ పండుగలకు, ప్రతీ ఆదివారం,వాక్యసంకల్పంతో పాటు సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్య సేవలు అందించేందుకు కట్టు బడి ఉన్నామని చెప్పారు. దేవుడి వాక్యంతో పాటు దైవ సంకల్పానికి కావాల్సిన సేవలు, ప్రజలకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని సూచించారు.

# పసుపు కుంకుమ భూమిని కాజేసేందుకు బెదిరింపులు

**స్టే ఆర్డర్ ఉన్నా న్యాయం జరగడం లేదంటూ బాధితుల ఆవేదన.. అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం శూన్యం**

**భూమిలో అడుగుపెడితే చంపేస్తామంటున్నారని ఆరోపణ.. తమకు న్యాయం చేయాలని మీడియా ఎదుట కన్నీటిపర్యంతమైన బాధిత కుటుంబం**







స్క్రిప్ట్...వివాహ సమయంలో పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూమిని తమ తమ్ముడి కుటుంబ సభ్యులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గుండ్లచెరువు కు చెందిన గాజుల ప్రభావతి, ఆమె కుమారుడు గాజుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాల మేరకు తమకు హక్కుగా సంక్రమించిన సర్వే నంబర్ 102/2 2.40 భూమి విషయంలో న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్ల నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ మీడియా ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు.తన వివాహం అనంతరం జీవనోపాధి కోసం సర్వే నంబర్ 102/2లోని భూమిని పసుపు కుంకుమ కింద తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించారని గాజుల ప్రభావతి తెలిపారు. అప్పటి నుంచి తమ కుటుంబ సభ్యులే ఆ భూమిని అనుభవిస్తూ సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు కాలువ నిర్మాణం సందర్భంగా తమ భూమికి సంబంధించిన నష్టపరిహారం సైతం తమ పేరుమీదే వచ్చిందని తెలిపారు. మిగిలిన భూమిలో కొబ్బరి చెట్లు, ఇతర పంటలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని వివరించారు. ఇటీవల తమ తమ్ముడి కుటుంబ సభ్యులు సదరు భూమిపై తమకు ఎలాంటి హక్కులు లేవని చెబుతూ, పొలంలో అడుగుపెడితే చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రభావతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ వ్యవహారంపై పలుమార్లు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని వాపోయారు. తమ తమ్ముడి కుటుంబ సభ్యుల నుంచి ఎదురవుతున్న బెదిరింపుల కారణంగా రాయచోటిలో నివాసం ఉంటున్నామని తెలిపారు.తమ అనుభవంలో ఉన్న భూమిని సర్వే చేసి న్యాయం చేయాలని మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు పలుమార్లు విజ్ఞప్తి చేసినట్లు బాధితులు తెలిపారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారులకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లోనూ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.గ్రామ సర్వేయర్, వీఆర్వోలు భూమి వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించకుండానే, తమతో మాట్లాడిన ఫొటోలు తీసుకుని, తమ ప్రమేయం లేకుండానే సమస్య పరిష్కారమైనట్లు ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తున్నారని ఆరోపించారు. తమ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించకుండా నివేదికలు ఇవ్వడం వల్ల తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తమ వద్ద ఉన్న భూమికి సంబంధించిన పత్రాలను చూపించినప్పటికీ అధికారులు వాటినే పదేపదే అడుగుతున్నారని బాధితులు తెలిపారు. తమకు హక్కులు ఉన్నట్లు కోర్టు స్టే ఆర్డర్ కాపీ ఉన్నప్పటికీ అధికారులు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. తమను ఇబ్బందులకు గురిచేస్తున్న వారికి కూడా సంబంధిత పత్రాలు చూపించాలని అధికారులు ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు.ఇరువర్గాల వాదనలు, వాస్తవాలు పూర్తిస్థాయిలో తెలుసుకోకుండానే కొందరు పెద్దలు ఒకవైపునకు అనుకూలంగా మాట్లాడుతున్నారని వాపోయారు. తాము ఇతరుల ఆస్తిని ఆశించడం లేదని, తమకు హక్కుగా సంక్రమించిన భూమిని మాత్రమే కోరుకుంటున్నామని గాజుల ప్రభావతి, ఆమె కుమారుడు గాజుల వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సంబంధిత భూమిపై సమగ్ర విచారణ జరిపి, పత్రాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా సర్వే నిర్వహించాలని అధికారులను కోరారు. తమకు న్యాయం చేయడంతోపాటు బెదిరింపులకు గురికాకుండా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు....

## ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

**అధికారులు బాధ్యతతో పనిచేయాలి.కలెక్టర్ వినోద్ కుమార్**



**బాపట్ల అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, సకాలంలో పరిష్కరించడమే అధికారుల ప్రధాన బాధ్యత అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవ స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ కావడంతో పాటు, ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం పెరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన, అర్జీల పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ అందేలా చూడాలని, ప్రతి అధికారి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఉత్తమ పనితీరు కనబరిచిన రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి బి. శ్రీదేవిని కలెక్టర్, సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. 1100 కాల్ సెంటర్ నివేదిక ప్రకారం 660 అర్జీలకు గాను 636 అర్జీలను ప్రీ ఆడిట్ పూర్తి చేసి 96.24 శాతం పురోగతి సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. అర్జీల పరిష్కారానికి అనుసరించిన విధానాలను శ్రీదేవి ఇతర అధికారులతో పంచుకున్నారు. ఓటరు నమోదు, ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు ఎన్నికల అక్షరాస్యత క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ వినోద్ కుమార్, సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ పీడీ వెంకటేశ్వరరావు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూటమి నాయకులకు విజ్ఞప్తి!..

**మండల ప్రజలకు!..అందరికీ విన్నపం!..**

**తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్!..**



**వరరామచంద్రాపురం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి ప్రతినిధి )**విలీన మండలాల్లో రాష్ట్ర శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి,13-10-2026 నాటి షెడ్యూల్ వివరాలు ఈవిధంగా ఉన్నాయని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్ర నరేష్ కుమార్, వివరించారు. మంగళవారం ఉదయం, 11గంటలకు రంప చోడవరం, ఐ.టి.డి.ఎ, ప్రాంగణంలో నిర్వహించే "అంతర్జాతీయ బధిరుల వారోత్సవం అంతర్జాతీయ సాంకేతిక భాషా దినోత్సవంకార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం: 12-30గంటలకు కూనవరం మండలం కూనవరం గ్రామంలో నిర్వహించే, ఎచ్చు వారి ఓని అలంకరణ వేడుక కార్యక్రమంలో పాల్గొంటారు.అనంతరంమధ్యాహ్నం2 గంటలకు, వరరామచంద్రాపురం, మండలం శ్రీరామగిరి గ్రామంలో శ్రీసుందరసీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అభివృద్ధి పనులు భూమిపూజ కార్యక్రమంలో పాల్గొంటారని సూచించారు. మధ్యాహ్నంగం3-30గంటల రేఖపల్లి పంచాయతీ అన్నవరం వాగుపై చప్టా నిర్మాణం, 1.10 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు. కూటమి పార్టీ నాయకులు, తెలుగుదేశం, జనసేన, బిజెపి మండల పార్టీల అధ్యక్షులు, నామినేటెడ్ పదవుల సభ్యులు,అనుబంధ కమిటీల సభ్యులు, ప్రజా ప్రతినిధులు, యూనిట్ క్లస్టర్ ఇంచార్జీలు, పార్టీ శ్రేణులు,కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



## మాజీ జెడ్పీటీసీ లోలుగు కాంతారావుకు పరామర్శ

**– పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఇరుపార్టీల నేతలు**





**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** పొందూరు మండల మాజీ జెడ్పీటీసీ లోలుగు కాంతారావు మాతృమూర్తి లోలుగు కాంతమ్మ ఇటీవల స్వర్గస్తులైయారు. ఈ విషయం తెలిసిన ఇరుపార్టీల నేతలు సోమవారం నాడు లోలుగు గ్రామంలో కాంతారావు నివాసం వద్ద ఆయనను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్సీపీ నాయకులు పాలవలస విక్రాంత్ , మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ , పిన్నింటి సాయి, టీడీపీ నాయకులు , పి. ఏ. సి.ఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ ,టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ జిల్లా తెలుగు యువత సెక్రటరీ లోలుగు వెంకట్ మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి పలువురు నాయకులు ,కార్యకర్తలు ఉన్నారు.

## ఆర్ పి ఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కే. రాజగోపాల రెడ్డికి ప్రతిష్ఠాత్మక 'రాష్ట్రపతి పోలీస్ పతకం' బహుకరణ

**హర్షం వ్యక్తం చేసిన డీఎస్సీ, ఆర్పీఎఫ్ అధికారులు మరియు సిబ్బంది**



**గుంతకల్లు అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)::** రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్) లో విశిష్ట సేవలు అందించిన గుంతకల్లు డివిజన్, రేణిగుంట ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ కే. రాజగోపాల రెడ్డి ప్రతిష్ఠాత్మకమైన "రాష్ట్రపతి పోలీస్ పతకం" అందుకున్నారు. ఛత్తీస్‌గఢ్ లోని రాయ్‌పూర్‌లో ఘనంగా నిర్వహించిన ఆర్పీఎఫ్ రైజింగ్ డే వేడుకల్లో ఆయనకు ఈ అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేశారు. దశాబ్దాలు గా రైల్వే ఆస్తుల పరిరక్షణ, ప్రయాణికుల భద్రత, క్రమ శిక్షణ మరియు అంకితభా వంతో కూడిన సేవలకు గుర్తింపుగా ఆయనకు ఈ పురస్కారం లభించింది. కే. రాజగోపాల రెడ్డి కి రాష్ట్రపతి పతకం లభించడం పట్ల గుంతకల్లు డివిజన్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఏ ఎస్ సి/గుంతకల్లు, ఆర్పీఎఫ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు మరియు ఆర్పీఎఫ్ సిబ్బంది హృదయపూర్వక అభినంద నలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్పీఎఫ్ అధికారులు మాట్లాడుతూ రాజగోపాల రెడ్డి నిబద్ధత, కర్తవ్య నిర్వహణ మరియు సేవా తత్పరతకు దక్కిన తగిన గౌరవం ఇది. ఆయన సాధించిన ఈ ఘనత గుంతకల్లు డివిజన్ ఆర్పీఎఫ్ వర్గానికి ఎంతో గర్వకారణం. ఆయన ప్రస్థానం భావితరాల ఆర్పీఎఫ్ సిబ్బందికి నిరంతరం స్ఫూర్తిదాయ కంగా నిలుస్తుంది" అని కొనియాడారు.

## రైతులకు యూరియా పంపిణీ



గాలివీడు... మండలంలోని పూలు కుంట స్వర్ణ గ్రామ సచివాలయ పరిధిలోని రైతులకు యూరియాను పంపిణీ చేసినట్లు వ్యవసాయ సహాయకులు వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం పూలు కుంట బో రెడ్డి గారి పల్లి గ్రామపంచాయతీల పరిధిలో వరి నీ సాగుచేసిన రైతులకు ఒక్కొక్కరికి రెండు బస్తాల యూరియా అందజేశామన్నారు. రైతులకు అవసరమైన వారందరికీ యూరియా అందుబాటులో ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, యు వ్వగలం సభ్యులు సాయి ప్రసాద్ రెడ్డి, డీలర్లు టోపీవలి, రెడ్డప్ప రెడ్డి, టిడిపి నాయకులు భాస్కర్ నాయుడు, ప్రభాకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. పూల కుంటలు యూరియాను రైతులకు అందజేస్తున్న వ్యవసాయ అధికారి.

## గంగవరం బోనాల జాతరలో భారీగా పాల్గొన్న మహిళా భక్తులు

**--అమ్మవారి బోనాలతో మార్మోగిన గ్రామం..**

**--భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**



**కాకినాడ జిల్లా అక్టోబర్ 12( ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** దేవి నవరాత్రుల సందర్భంగా కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గంగవరం గ్రామంలో నిర్వహించిన బోనాల జాతర భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించిన ఈ వేడుకలో గంగవరం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళా భక్తులు భారీగా పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన బోనాల వేడుకలు, అమ్మవారి నామస్మరణలతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, గ్రామ ప్రజల సమష్టి సహకారంతో జాతర విజయవంతంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని భక్తులు ప్రార్థించారు.

# మురళీ రాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన గుడివాడ అమర్నాథ్





**--ధర్మవరంలో ముదునూరి రామరాజు చిత్రపటానికి నివాళులు..**

**కాకినాడ జిల్లా అక్టోబర్ 12(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు తండ్రి ముదునూరి రామరాజు ఇటీవల మృతి చెందడంతో మాజీ మంత్రి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ సోమవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మురళీ కృష్ణంరాజుతో పాటు కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబానికి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు జువ్వల బాబులు, నానిపల్లి చంటి, పోతులూరు మాజీ సర్పంచ్ బొండు రాంబాబు, ప్రత్తిపాడు వైసీపీ ఉపాధ్యక్షుడు కిల్లాడి బాబ్జి, మాజీ ఉపసర్పంచ్ జువ్వల సత్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొల్లు రాజుబాబు, మచ్చర్ల దాసు, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, గదుల శివ, చేకూరి రాంబాబు రాజు, కోన బాబ్జి, గళ్ళా నాగరాజు, దెందుకూరి సత్తిబాబు రాజు, ఎలుగుబంటి బాబ్జి, మచ్చర్ల రాజు, సిద్దా అప్పలరాజు, సిద్ధ బాబ్జి, కుప్పిన నరసింహమూర్తి, దెందుకూరి రామకృష్ణ రాజు, అడ్డాల సూర్యనారాయణ రాజు, దెందుకూరి జగ్గబాబు రాజు, నానిపల్లి రమణ, కోలా కొండబాబు, దెందుకూరి సీతారామరాజు, పెండ్యాల అబ్బు, జక్కల పోలీస్, కాపరపు బుజ్జిబాబు, జువ్వల రాజా, మద్రి సుబ్బారావుతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ వీరన్న అంత్యక్రియలకు హాజరైన ఎస్పీ

**కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేత**



**బాపట్ల అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పోలీస్ కానిస్టేబుల్ ఎల్. వీరన్న అకాల మరణంతో బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో విషాదం నెలకొంది. ఆయన మృతిపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలోని రామానగర్‌లో ఉన్న వీరన్న స్వగృహానికి చేరుకున్న ఎస్పీ, ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులను, బంధువులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీస్ శాఖ తరపున కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.బాపట్ల జిల్లా ఆర్మ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో విధులు నిర్వహిస్తున్న 2013 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ ఎల్. వీరన్న ఆదివారం మృతి చెందారు. ఆయన మరణవార్తతో సహచర పోలీస్ సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. విధుల పట్ల నిబద్ధతతో పనిచేసిన వీరన్న సేవలు పోలీస్ శాఖకు విలువైనవని, ఆయన మృతి శాఖకు తీరని లోటని ఎస్పీ పేర్కొన్నారు.వీరన్న కుటుంబానికి శాఖాపరంగా అందాల్సిన పరిహారాలు, ఇతర రాయితీలను సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆయన సతీమణి నాగమణికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం పోలీస్ శాఖ అధికారిక లాంఛనాలతో వీరన్న అంత్యక్రియలు నిర్వహించగా, కుటుంబ సభ్యులు, బంధువులు, సహచరులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సీఐ నారాయణ, చీరాల రూరల్ సీఐ సుధాకర్, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వేటపాలెం ఎస్ఐ జనార్ధన్‌తో పాటు పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని వీరన్నకు తుది నివాళు లర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# బూడిదవుతున్న కలవటాల రైతుల ఆశలు

**బాధితులకు పరిహారం ఇవ్వకపోతే ఫ్యాక్టరీ వద్దే ఆమరణ దీక్షే!**

**రామ్‌కో సిమెంట్ కాలుష్యంతో అప్పుల ఊబిలో అన్నదాతలు**

**మంత్రి హామీ ఇచ్చినా దక్కని న్యాయం.. మండిపడుతున్న సీపీఐ**

**జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేసిన నాయకులు, బాధిత రైతులు**



**నంద్యాల:అక్టోబర్=12ఁప్రజాజ్యోతి** కష్టపడి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట చేతికొస్తుందనుకున్న ప్రతిసారీ.. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ చిమ్ముతున్న కాలుష్య ధూళి కలవటాల రైతుల ఆశలను బూడిద చేస్తోంది. రక్తాన్ని నీరుగా మార్చి, అప్పులు తెచ్చి సాగు చేసిన పంటలు కళ్లముందే మాడిపోతుంటే.. ఆ గ్రామ రైతులు గుండెలు అవిసేలా రోదిస్తున్నారు. కాలుష్య కాటుకు పంటలు నాశనమై, అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమను ఆదుకోవాలని, తగిన నష్టపరిహారం చెల్లించాలని ఎంత మొత్తుకున్నా రామ్‌కో యాజమాన్యం కనికరించకపోవడం దారుణమని సీపీఐ, ఏపీ రైతు సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. బాధిత రైతులకు తక్షణమే పరిహారం చెల్లించకపోతే, కాలుష్య బాధిత రైతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ఎదుట పెద్ద ఎత్తున ఆమరణ నిరాహార దీక్షలకు దిగుతామని తెగేసి చెప్పాయి. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దిన్, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ. సుబ్బారెడ్డి, కార్యదర్శి జి. సోమన్న, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్యల ఆధ్వర్యంలో నష్టపోయిన బాధిత రైతులతో కలిసి నంద్యాల జిల్లా ఎస్పీకి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కొలిమిగుండ్ల మరియు సంజామల మండలాల సరిహద్దుల్లో ఉన్న రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ నుండి వస్తున్న విషతుల్యమైన పొగ, దుమ్ము వల్ల చుట్టుపక్కల పంట పొలాలు శ్మశానాలను తలపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు పండక, చేసిన అప్పులు తీరక రైతులు తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారన్నారు. గతంలో యాజమాన్యం మొండివైఖరికి నిరసనగా ఏప్రిల్ 10వ తేదీన ఫ్యాక్టరీ ముట్టడికి పిలుపునిచ్చిన సమయంలో, జిల్లా ఎస్పీ స్పందించి నాయకులతో, రైతులతో చర్చలు జరిపారన్నారు. రాష్ట్ర మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డితో కలిసి చర్చించి సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇవ్వడంతో అప్పట్లో ముట్టడి కార్యక్రమాన్ని విరమించుకున్నట్లు గుర్తుచేశారు. అయితే, అప్పటి నుండి ఇప్పటివరకు మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి దాదాపు 10 సార్లు బాధితులను చర్చలకు పిలిచినప్పటికీ, ఆచరణలో రైతులకు చిల్లిగవ్వ పరిహారం దక్కలేదని, ఇది అన్నదాతలను మోసం చేయడమేనని మండిపడ్డారు.ఇప్పటికైనా జిల్లా ఎస్పీ మానవత్వంతో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని బాధిత రైతులకు యాజమాన్యం నుంచి త్వరగా న్యాయం, సరైన పరిహారం లభించేలా చూడాలని డిమాండ్ చేశారు. తాము ఇచ్చిన గడువులోగా పరిహారం చెల్లించకపోతే, కాలుష్య బాధిత రైతులు మరియు వారి కుటుంబ సభ్యులతో కలిసి రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ వద్దే ఆమరణ నిరాహార దీక్షలతో రణరంగం సృష్టిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు వేణుగోపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పుల్లయ్య, బాలనాగిరెడ్డి, పెద్దయ్య, ఓబులేసు, ప్రభాకర్ రెడ్డి, బాల నాగేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ఆవేదనను వెళ్లగక్కారు.

## బుట్టాయిగూడెం శివాలయంలో ఘనంగా అన్నదాన వితరణ

**పవిత్ర సోమవారం వేళ పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు**

**అన్నదాతలుగా జర్నలిస్టు సోదరుల కుటుంబం**

**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు**



**ఎటపాక, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):**పవిత్ర సోమవారాన్ని పురస్కరించుకుని ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామ శివాలయంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయానికి చేరుకున్న భక్తులు పరమేశ్వరుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుపుల్ల కృష్ణమాచార్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్నవరం గ్రామానికి చెందిన పాత్రికేయులు పిడియాల రాంబాబు (ల్యాబ్ తోటపల్లి, ఆంధ్రప్రభ రిపోర్టర్), వారి సోదరుడు పిడియాల మోహనరావు (విశాలాంధ్ర రిపోర్టర్) కుటుంబ సభ్యుల సౌజన్యంతో భక్తులకు విస్తృత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు స్వయంగా అన్నప్రసాద వితరణ చేపట్టగా, స్థానిక భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దాతలు, భక్తుల సహకారంతో ప్రతి సోమవారం నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావుతో పాటు పలువురు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

# ఎన్నికల బందోబస్తుకు పక్కా ప్రణాళిక

## సమస్యాత్మక గ్రామాలు, వార్డుల గుర్తింపునకు ఆదేశాలు

## గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. గత ఎన్నికల అనుభవాలు, ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తించి, ముందస్తు చర్యలతో పటిష్టమైన బందోబస్తు ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పోలీసు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం నాటికి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అవసరమైన మేరకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బైండోవర్ కేసుల్లో తక్షణ చర్యలు చేపట్టడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఎలాంటి సమన్వయ లోపాలు తలెత్తకుండా మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, డీపీఓ సాయికుమార్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# హాలహర్విలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

**రూ.30 లక్షలతో రహదారి పనులు ప్రారంభం.**

**ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే కూటమి లక్ష్యం: టీడీపీ నేతలు**




**నందవరం, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** నందవరం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా రూ.30 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు టీడీపీ నేతలు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులను ప్రారంభించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలను మెరుగుపరిచి, ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయిస్తూ కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డికి గ్రామ ప్రజలు, కూటమి నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ంఈ కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, టీడీపీ మండల నాయకులు రైస్ మిల్ నారాయణ రెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్న గౌడ్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మాధవరావు దేశాయ్, సొసైటీ చైర్మన్ ధర్మపురం గోపాల్, టీడీపీ మండల కన్వీనర్ కాసిం వలి, చిన్న కొత్తలి డీసీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ దావీదు, బ్రహ్మానంద రెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఎర్రన్న, నాయకులు జగన్నాథ్ రెడ్డి, ప్రభుదాసు, బి నాగరాజు, జగ్గాపురం నరసింహులు, లచ్చప్ప, తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలి

**– ఖాకీల దాడులపై అడ్వకేట్ లు నిరసన**



**శ్రీకాకుళం ,ప్రజాజ్యోతి న్యూస్ :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి ) జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని శాంతియుతంగా పోరాడుతున్న ప్రతిపక్షాలు యువజన, విద్యార్థి సంఘాలు కాక్రోచ్ జనజీ న్యూఢిల్లీలోనూ ఇటు విజయవాడలోనూ దేశవ్యాప్తంగా తదితర ప్రాంతాలలో పోలీస్ దాడులు నిర్బంధ చర్యలను అక్రమ అరెస్టును ఖండిస్తూ శ్రీకాకుళం కోర్టు ఆవరణము నుండి అంబేద్కర్ జంక్షన్ వరకు శాంతియుత ప్రదర్శన అడ్వకేట్స్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్ మాట్లాడుతూ , నిరసనకారులపై అక్రమంగా నిర్బంధించవద్దని, ప్రజల స్వేచ్ఛాయుత రాకపోకలు అనుమతించాలని మెట్రో రైలు, రైల్వే సాధారణ సేవలు కొనసాగించాలని ఇంటర్నెట్ సేవలు అంతరాయం కలిగించవద్దని బి ఎన్ ఎస్ ఎస్ 163 అమలులో ఉందని బోర్డులు తొలగించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. సర్ పేరుతో 13 వేలు కోట్లు ఓట్లను అక్రమంగా తొలగించి ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నీ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. నిరసన కారులు శాంతిస్తుతంగా ఆందోళన చేస్తున్న మహిళలు విద్యార్థి యువజన నాయకులపై ఆర్ఎస్ఎస్ ప్రైవేట్ సైన్యం ముసుగులో బిజెపి దాడులు బడితెగించిందని ఇది పిరికిపంద చర్య అని తెలిపారు. ఢిల్లీలో 35 వేల మంది సైన్యాన్ని పెట్టి ప్రతిపక్ష ఎంపీల కార్యాలయాల్లో, ప్రజా సంఘాల నాయకులను చొరబడి అక్రమ అరెస్టులు చేయడంతో పాటు సిపిఎం ఎంపీ రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిట్టాస్ నిరసనకు మద్దతుగా వెళ్ళినందుకు ఎంపీ ఐడి కార్డు చూపించి చెప్పినప్పటికీ సిఆర్పి బలగాలు పిడిగుద్దులు తో దాడి చేసి ప్రజాప్రతినిధులపైనే కర్కశంగా వ్యవహరించడం ఎమర్జెన్సీ తల పెంచేలా ఉందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో అధికార ప్రతిపక్ష పార్టీలు నోరు తెరిచి ఓట్ల చోరీపై ప్రశ్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మామిడి క్రాంతి పైడి విశ్వేశ్వరరావు పొన్నాడ రాము బోయిడి మురళీకృష్ణ వై చలపతిరావు బొడ్డేపల్లి రవి కుమార్ కాంగ్రెస్ లీగల్ సెల్ బొడ్డేపల్లి శ్రీను యాడ్ల రామకృష్ణ పిలిప్స్, భవిరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు

# బిసి పక్షపాతి జగన్..

# నిండా ముంచుతుంది చంద్రబాబు

**బిసిలను దూషించిన చంద్రబాబు.. సొసైటికి బ్యాక్ బోన్ చేసింది జగన్**

**రిజర్వేషన్ పై ద్వంద వైఖరితో చంద్రబాబు**

**బిసి కులాలకు 58 కార్పోరేషన్లు ఏర్పాటు చేసిన జగన్**



**కాకినాడ (ప్రజా జ్యోతి)** రాష్ట్రంలో బిసిలను అడ్డుపెట్టుకుని చంద్రబాబు కుటిల రాజకీయానికి తెరతీసారని ఆరోపించారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల వేళ చంద్రబాబు బిసిల పట్ల కపట ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. స్వర్గీయ ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి వెన్నెముక బీసీలు అయితే ఇప్పుడున్నది చంద్రబాబు టిడిపి అన్నారు. మోసానికి బ్రాండ్ అంబాసిడర్ అని ఎద్దేవా చేసారు, అందుకు కారణం గతంలో చంద్రబాబు బిసిల పట్ల వ్యవహరించ తీరేనని స్పష్టం చేసారు. సాక్షాత్తు రాష్ట్ర సచివాలయంలో బిసిల తోకలు కత్తిరిస్తానని చంద్రబాబు వారిని అవమానించారని గుర్తు చేసారు. వాస్తవానికి రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా ఆర్థికంగా వెన్నుదన్నుగా నిలిచింది మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని స్పష్టం చేసారు. గత ప్రభుత్వంలో 139 బిసి ఉపకులాలకు 58 కార్పోరేషన్లు ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి నాంది పలికారన్నారు. ఒక చేత్తో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ అని ప్రకటనలు చేస్తూ మరో వైపు ప్రతాప్ రెడ్డి లాంటి వారితో కోర్టుల్లో కేసులు వేయించడం చంద్రబాబు కుటిల రాజకీయానికి తార్కాణం అన్నారు.య నామినేటెడ్ పదవులు మొదలు, కాంట్రాక్టులు, చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి మైనారిటీలకు సముచిత స్థానం కల్పించి సామాజిక న్యాయం చేసింది ఒక్క జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని వెల్లడించారు. గత ప్రభుత్వంలో సుమారుగా రూ. 4 లక్షల కోట్లకు పైగా బిసిలకు చేయూతనందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని స్పష్టం చేసారు. బిసి కులాలకు సున్నావడ్డీ, ఆసరా, చేయూత, నేతన్న నేస్తం, మత్స్యకార భరోసా వంటి పథకాలను అందించారని గుర్తు చేసారు. ఇక రాజకీయ పరంగా బిసిలకు దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రాధాన్యత కల్పించారన్నారు. డిప్యూటి సిఎం పదవి మొదలు వార్డు మెంబర్లకు వరకు బిసిలను బ్యాక్ బోన్ గా భావించి పట్టకట్టారన్నారు. మరి ఏం చేసారని చంద్రబాబు బిసిల పక్షపాతి అనుకోవాలని ప్రశ్నించారు. 2014 -- 19 మధ్య బిసిలకు ఒక్క రాజ్యసభ స్థానం అయినా ఇచ్చారా అన్ని ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్ అమలు సాధ్యం కాదని తెలిసినా వారిని మోసం చేసేందుకు మరోసారి కపట ప్రేమను చూపిస్తున్నారని మండిపడ్డారు జమ్మలమడక నాగమణి..

## గుంతకల్లు పట్టణ ప్రజలకు శాశ్వత మంచినీటి సమస్యకు పరిష్కారం చూపుతాం

**: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**



**గుంతకల్లు అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):**గుంతకల్లు పట్టణ ప్రజలకు శాశ్వత మంచినీటి సమస్యకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. సోమవారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆయన సోదరుడు గుంతకల్లు మండలం ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి తో కలిసి గుంతకల్లు పట్టణం నందు ఎస్ ఎస్ ట్యాంకును పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ గతంలో తాను ఎస్ఎస్ ట్యాంకు పరిశీలనకు వచ్చినప్పుడు నీళ్లు పచ్చగా ఉన్నాయని ఫిల్టర్ కావడం లేదని తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. అదే విధంగా గతంలో ఐదేళ్లకు ఒకసారి ఫిల్టర్ ప్యాడ్స్ మార్చడం జరిగిందని మన కూటమి ప్రభుత్వం వచ్చిన మూడేళ్ల లోనే ఫిల్టర్ ప్యాడ్స్ మార్చి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని అందించేందు కు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం రెండు కొత్త మోటార్లు ప్రారంభించి మంచి నీరు ఎస్ ఎస్ వన్ ట్యాంక్ స్టోరేజ్ కు ఉపయోగించడానికి కృషి చేశామని తెలిపారు. అదే విధంగా గతంలో వారానికి ఒకసారి నీళ్లు వచ్చేవని మన ప్రభుత్వం వచ్చిన తర్వాత మూడు రోజులకు ఒకసారి నీటిని అందిస్తున్నా మని, గుంతకల్లు పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య లేకుండా చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తలు మరియు అధికార సిబ్బంది మున్సిపల్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణా. తవ్వకాలపై అనంతగిరి ఎమ్మార్వోకు చిలకల గెడ్డ గ్రామపంచాయతీ ప్రజలు.



**పీసా కమిటీ సభ్యులుఫిర్యాదు. అనంతగిరి మండలం. అక్టోబర్ 12. ప్రజా జ్యోతి న్యూస్.** రిపోర్టర్ శంకర్. అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం. చిలకలగెడ్డ పంచాయితీ పరిధి గోస్తాని నదీ జలాల నుండి మైదాన ప్రాంత ఇసుకవ్యాపారులు విచ్చలవిడిగా తవ్వకాలు జరిపి మైదాన ప్రాంతాలైన ఎస్ కోట.విజయనగరం.బొడ్డవార తదితర ప్రాంతాలకు అక్రమంగా తరలించకపోతున్నారని గ్రామస్తులు పంచల జన్ని జమ్మనదొర. చిలకల గడ్డ గ్రామపంచాయతీ తెలుగుదేశం పార్టీగ్రామ కమిటీ అధ్యక్షుడు పైడిరాజు. టి.డి.పి బూత్ ఇంచార్జ్ సురేష్. పీసా కమిటీ సభ్యులు ఎన్. సన్యాసిరావు డి. ఎండి దొర . తదితరులు సోమవారం నాడు అనంతగిరి మండల రెవెన్యూ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు కు స్పందించిన అధికారి తక్షణమే విచారణ జరిపి అక్రమ ఇసుక రవాణా తవ్వకాలపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హామీ ఇచ్చారు. చర్యలు తీసుకొని గ్రామస్తుల ఫిర్యాదు పై స్థానిక ఎమ్మార్వో కు ప్రజా జ్యోతి పత్రిక వివరణ కోరగా ఫిర్యాదును పరిశీలించడం జరిగిందని ఎటువంటి ఇసుక అక్రమ రవాణా తవ్వకాలు జరగకుండా శాఖా పరమైన చర్యలు తీసుకుని అక్రమ రవాణాలను నిషేధిస్తామని ఎమ్మార్వో వెల్లడించారు.

## ఆమదాలవలస మున్సిపాలిటీకి రూ.41.53 లక్షలతో జేసీబీ

**– ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో ఏపీజెన్‌కో సీఎస్ఆర్ నిధులు మంజూరు**



**ఆమదాలవలస, ప్రజాజ్యోతి న్యూస్:**ఆమదాలవలస పట్టణంలో పారిశుధ్య పనులను మరింత మెరుగుపరిచేందుకు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ చొరవ తీసుకున్నారు. ఆయన కృషితో ఏపీజెన్‌కో సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.41.53 లక్షలతో బ్యాక్‌హో లోడర్ జేసీబీ కొనుగోలుకు నిధులు మంజూరయ్యాయి. పారిశుధ్య పనులకు యంత్రాంగం కొరత పట్టణంలో రోడ్లపై పేరుకుపోతున్న చెత్త కుప్పలు, మట్టి దిబ్బలు, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించడంతో పాటు రహదారుల పక్కన పిచ్చి మొక్కల తొలగింపు, అనధికార నిర్మాణాల తొలగింపు వంటి పనులకు జేసీబీ అవసరమని మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీలో సొంతంగా యంత్రం లేకపోవడం, కొత్త వాహనం కొనుగోలుకు నిధుల కొరత ఉండటంతో పనులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యపై స్పందించిన కూన రవికుమార్ ఏపీజెన్‌కో ఉన్నతాధికారులతో మాట్లాడి, జేసీబీ కొనుగోలుకు సీఎస్ఆర్ నిధులు మంజూరు చేయాలని కోరుతూ లేఖ రాశారు. ఆయన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఏపీజెన్‌కో అధికారులు వరుణ్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా జేసీబీ కొనుగోలుకు రూ.41,53,000 చెక్కును మంజూరు చేశారు.మున్సిపల్ కమిషనర్‌కు చెక్కు అందజేత సోమవారం నాడు విజయవాడలోని ఏపీజెన్‌కో కార్యాలయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ సమక్షంలో ఏపీజెన్‌కో ఎండీ నాగలక్ష్మి, ఐఏఎస్, డైరెక్టర్ పి.అశోక్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన ఏపీజెన్‌కో ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. పారిశుధ్య పనులకు మరింత ఊతం సీఎస్ఆర్ నిధుల మంజూరుకు చొరవ చూపిన ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండు మూడు రోజుల్లో జేసీబీ మున్సిపాలిటీకి చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని, వాహనం అందుబాటులోకి వచ్చిన వెంటనే పట్టణంలో పారిశుధ్య పనులను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

# కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

-ఉమ్మిడి వెంకటరావు

--తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి..

--అరెస్టు చేసిన విద్యార్థులను విడుదల చేయాలి

--అఖిలపక్ష ధర్నాలో కాంగ్రెస్ ఇంచార్జి ఉమ్మిడి వెంకట్రావు




**కాకినాడ జిల్లా అక్టోబర్ (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రత్తిపాడులో ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేద్కర్ కళామందిర్, అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు ర్యాలీగా చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీకి అనుకూలంగా పక్షపాత ధోరణితో పనిచేస్తోందని ఆరోపించారు. 13 కోట్ల ఓట్ల తొలగింపునకు బాధ్యత వహిస్తూ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. శాంతియుతంగా ఆందోళన చేసేందుకు సిద్ధమైన యువతపై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడం పిరికిపంద చర్య అని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ప్రతి పౌరుడికి ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ఉందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసిన 10 వేల మంది ఆందోళనకారులు, విద్యార్థులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన 13 కోట్ల మంది భారతీయుల ఓట్లను పునరుద్ధరించి, ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు కల్పించాలని, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడుకునేందుకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ నుంచి భారత రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు రాబోయే రోజుల్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ధరణాల కోట శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు ఊటా శ్రీను, జిల్లా కార్యనిర్వాహక సభ్యులు కొప్పన కోటేశ్వరరావు, కాకినాడ జిల్లా క్రీడా విభాగం అధ్యక్షులు రామకుర్తి సూర్యనారాయణ, ప్రత్తిపాడు మండల కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డిపట్ల సుబ్బరాజు, ఏలేశ్వరం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గున్నపు శ్రీనివాస్, ప్రత్తిపాడు సమన్వయ కమిటీ సభ్యులు ధోని వెంకటేశ్వర్లు, సీపీఎం కన్వీనర్ రొంగల ఈశ్వరరావు, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మానికొండ లచ్చబాబు, సీపీఐ ఎంఎల్ వినోద్ మిశ్రా నాయకులు గండేటి నాగమణి, కందుల ప్రసాద్, సీఐటీయూ నాయకులు పోసపల్లి రమణ, అల్లాడి లక్ష్మి, పైల సూరిబాబు, కె. వరలక్ష్మి, అనంతలక్ష్మి, మరియా తదితరులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా షాపు యజమానులు సహకరించాలి





: డీఎస్పీ బి. శ్రీనివాసరావు

**గుంతకల్లు అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి):** పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టి లో ఉంచుకొని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా షాపు యజమానులు సహకరించాలని గుంతకల్లు డీఎస్పీ బి. శ్రీనివాసరావు సూచించారు. ఈ సందర్భంగా గుంతకల్లు డీఎస్పీ బి. శ్రీనివాసరావు సమక్షంలో గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీధర్ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, షాపు యజమానులతో ట్రాఫిక్ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలోని మెయిన్ రోడ్డు, మంది బజార్, మార్కెట్ ప్రాంతాల్లో కొంతమంది షాపు యజమానులు నిర్ణీత సమయాలను పాటించకుం డా సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ చేయడంతో పాటు, వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపి ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోం దని తెలిపారు. దీనివల్ల వాహనదారులు, పాదచా రులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను నివారించేం దుకు షాపు యజమానులు తప్పనిసరిగా రాత్రి 08:30 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 07:30 గంటల వరకు మాత్రమే సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్ నిర్వహించుకోవాలని సూచించారు. నిర్ణీత సమయాల్లో మాత్రమే సరుకుల రవాణా చేపట్టాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా వాహనాలను రోడ్లపై నిలిపి ఉంచరాదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, షాపు యజమానులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు పట్టణ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, షాపు యజమానులు పాల్గొన్నారు.

# కౌతాళంలో దేశాయ్ కృష్ణ నాల్గవ వర్ధంతి







**:- దేశాయ్ కృష్ణ ఫోటోకు నివాళులర్పించిన దేశాయ్ కృష్ణ సైనికులు**

**కౌతాళం అక్టోబర్ 12 ప్రజా జ్యోతి** కౌతాళం వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లద ఆచారి ఆధ్వర్యంలో ఘనంగా క్రీ.శే.దేశాయి క్రిృష్ణ 4వ వర్ధంతి కౌతాళంలో వైఎస్ఆర్సిపి పార్టీ ఆఫీసులో శ్రీ దేశాయి కృష్ణ నాలుగో వర్ధంతి సందర్భంగా మొదట ఫోటోకు పూలమాల వేసి ఆయనకు నివాళులర్పించారు. మరియు ఆయన ఆత్మకు కూడా మనశాంతి కలిగించాలని అక్కడ ఉన్నఅక్కడున్న మాజి సర్పంచులు ఎంపీటీసీలు వార్డ్ మెంబర్లు మండల నాయకులు తదితరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ మాజీ ఎంపీపీ బుజ్జి స్వామి మాజి సర్పంచులు పాల్ దినకర్, అవతారం,సక్రి తిక్కయ్య,వడ్డె రాము,నర్సిరెడ్డి,పాల్ రెడ్డి, ఉమాపతి, వై.బీమేష్,వడ్డె చిన్న ఉసేని,బెస్త అనుమేష,సక్రి శ్రీరామ్,బెస్త నరసింహ,నారాయణ,రామకృష్ణ,శ్రీకాంత్ గౌడ్, రౌడూర్ నర్సిరెడ్డి,ఎంపీటీసీ ముకన్న, మహేంద్ర, మహమ్మద్, వాలంటిరి సిద్దు,జీడి.ఖదర్, సోషల్ మీడియా మండల కన్వీనర్ ఖాదర్ లింగ మండల వైఎస్ఆర్సిపి అభిమానులు మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## ఆమదాలవలస మున్సిపల్ చైర్మన్ రేసులో అన్నెపు సుజాత

- బీసీ మహిళ రిజర్వేషన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ
- పట్టణ అభివృద్ధే లక్ష్యమంటూ వెల్లడి
- ఆమదాలవలస మున్సిపాలిటీని నెంబర్ 1 గా తీర్చిదిద్దుతా
- అన్నెపు సుజాత





**ఆమదాలవలస, ప్రజాజ్యోతి న్యూస్ :**ఆమదాలవలస మున్సిపాలిటీ చైర్మన్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఎన్నికల బరిలోకి స్వతంత్ర అభ్యర్థులు సైతం దిగుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త అన్నెపు సుజాత, స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు.

**మౌలిక సమస్యల పరిష్కారమే లక్ష్యం**

ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ, రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సుజాత పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎన్నికైతే పార్టీలకు అతీతంగా ప్రతి వార్డును అభివృద్ధి చేసి, ఆమదాలవలస మున్సిపాలిటీని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. పేదలకు అండగా ఉంటా.. అవినీతి రహిత పాలన అందిస్తా బీసీ మహిళలు, పేదలు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని సుజాత హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అవినీతి రహిత పాలన అందించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని ఆమె కోరారు.

## డోన్‌లో 15 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

**ఆరు కాలనీల్లో పనులకు ఎమ్మెల్యే కోట్ల భూమిపూజ**





**డోన్ : అక్టోబర్12(ప్రజా జ్యోతి)** డోన్ పట్టణంలోని ఆరు కాలనీల్లో రహదారి సమస్యలకు పరిష్కారం చూపే దిశగా 15 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) పథకం కింద చేపట్టనున్న ఈ పనులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి భూమిపూజ చేశారు.పట్టణంలోని వైఎస్ నగర్, వెంకటేశ్వర కాలనీ, తారక్ రామ్ నగర్, సుజాతమ్మ నగర్, శ్రీనివాస నగర్, టీచర్స్ కాలనీల్లో ఈ నిర్మాణ పనులు జరగనున్నాయి. రోడ్ల నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు స్థానికులు ఎదుర్కొంటున్న రహదారి సమస్యలు తగ్గనున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, డోన్ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలను దశలవారీగా కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాధనంతో చేపట్టే పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాను నిషేధించకపోతే ఆందోళన చేపడతాం పిసా కమిటీ సభ్యులు హెచ్చరిక.



**అనంతగిరి మండలం. అక్టోబర్ 12. ప్రజా జ్యోతి న్యూస్.రిపోర్టర్ శంకర్ అల్లూరి సీతారామరాజు జిల్లా.అనంతగిరి మండలం.** చిలకల గడ్డ గ్రామపంచాయతీ పరిధి వెంకయ్య పాలెం. వరకు ఒడ్డు. జీలుగులపాడు. గ్రామాల సరిహద్దు నది జలాల నుండి అక్రమంగా ఇసుక మైదాన ప్రాంతాలకు తరలిపోతుందని. దీంతో స్థానిక ప్రజలు ఇల్లు నిర్మాణాలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటే మైదాన ప్రాంత దొంగ వ్యాపారులు స్థానిక పెద్దలు. ప్రజాప్రతినిధులు. ప్రజలపై తిరుగుబాటు చేసి ప్రశ్నిస్తే చంపేస్తామని బెదిరింపులు జారీ చేస్తున్నారని దీంతో తీవ్ర ఆందోళన చెందుతున్న ప్రజలు భయభ్రాంతులకు గురికావాల్సి వస్తుందని పీసా కమిటీ సభ్యులు స్థానిక వి.ఆ.ర్.ఓ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బెదిరింపులు.అక్రమ రవాణా తదితర అంశాలతో కూడిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్. సబ్ కలెక్టర్. అనంతగిరి ఎమ్మార్వో. స్థానిక వీఆర్వోలకు ఫిర్యాదు లు చేసినట్లు కమిటీ సభ్యులు సోమవారం నాడు విలేకరులకు తెలిపారు. అధికారులు స్పందించిన ఎడల అనంతగిరి మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. స్థానిక ప్రజలు విఆర్ఓ కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం ఫోటోలో కనబడుతుంది.

## కంచి కామాక్షి ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

- గాయత్రి దేవి అవతారంలో భక్తులకు అమ్మవారి దర్శనం



**పొందూరు ,ప్రజాజ్యోతి న్యూస్:**శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పొందూరు మండల కేంద్రంలో అగ్రహారం వీధిలో వెలసియున్న శ్రీ కంచి కామాక్షి ఆలయంలో రెండవ రోజు అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.ప్రతీ ఏటా కంచి కామాక్షి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను అంగరంగా వైభవంగా నిర్వహించడం విశేషం. ఇందులో భాగంగా సోమవారం నాడు పురోహితులు కూనపులి సూరిబాబు వేద మంత్రోర్చ నలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు ,కుంకుమార్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో కంచి కామాక్షి ఆలయ కమిటీ చైర్మన్ సింహాద్రి ధనుంజయ రావు దంపతులు అధ్యక్షులు కొండపల్లి సూర్యనారాయణ దంపతులు , రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ , టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చనలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## కన్నడోత్సవం--2026లో ప్రముఖ కవి జాజి దేవేంద్రప్పకు ప్రత్యేక గుర్తింపు

**అక్టోబర్ 17న మైసూరులో కన్నడోత్సవం..**

**పలువురు సాహితీ ప్రముఖుల సమక్షంలో వేడుకలు**



**హోళగుంద, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి న్యూస్ -** కన్నడ భాష, సాహిత్యం, సంస్కృతి వైభవాన్ని చాటిచెప్పే లక్ష్యంతో దసరా ఉత్సవాల్లో భాగంగా అక్టోబర్ 17న మైసూరులో కన్నడోత్సవం--2026 నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలో మండల పరిధిలోని ఎల్లార్తి గ్రామానికి చెందిన ప్రముఖ కవి డా.జాజి దేవేంద్రప్ప పేరు చోటుచేసుకోవడం విశేషం.బి.ఎం.శ్రీ. సుభాషణ, కువెంపు కన్నడ అధ్యయన సంస్థ, మానసగంగోత్రి, మైసూరు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఉదయం 9 గంటలకు సుగమ సంగీత కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమై, 10.30 గంటలకు ప్రధాన కార్యక్రమం నిర్వహించనున్నారు.ఈ వేడుకల్లో పలువురు సాహితీవేత్తలు, విద్యావేత్తలు, ప్రముఖులు పాల్గొననున్నారు. కన్నడ భాషా సాహిత్యాన్ని ప్రోత్సహించడం, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కవులు, సాహితీప్రియుల్లో ఆసక్తి ప్రముఖ కవి జాజి దేవేంద్రప్పకు సంబంధించిన ప్రస్తావనతో ఈ కన్నడోత్సవం సాహితీ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.. ఇంతటి మహోత్తర కార్యక్రమంలో ఎల్లార్తి గ్రామానికి చెందిన కవి డాక్టర్.జాజి దేవేంద్రప్ప కు స్థానం దక్కడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొవ్వూరు మున్సిపల్ చైర్మన్ గా జొన్నలగడ్డ రాధారాణి కి జై కొడుతున్న జనం



**తాళ్లపూడి, అక్టోబర్12, ప్రజాజ్యోతి న్యూస్** కొవ్వూరు మున్సిపల్ చైర్మన్ పదవి జనరల్ మహిళకు కేటాయించడంతో రాజకీయం వేడెక్కింది. రిజర్వేషన్ ఖరారవ్వగానే చైర్మన్ పీఠం కోసం ఆశావాహుల జాబితా రోజురోజుకూ పెరుగుతోంది. అధికార కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి పలువురు మహిళా నేతలు ఈ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే ప్రజల్లో మాత్రం భిన్నమైన అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో మున్సిపల్ చైర్మన్ గా పనిచేసిన జొన్నలగడ్డ రాధారాణి అనుభవం మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతో అవసరమని పట్టణ ప్రజలు బలంగా కోరుకుంటున్నారు. రాధారాణి హయాంలోనే కొవ్వూరు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులు జరిగాయని, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, రోడ్లు, వీధి దీపాల వంటి మౌలిక సమస్యల పరిష్కారంలో ఆమె ముందుచూపుతో వ్యవహరించారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. పాలనలో పారదర్శకత, ప్రజలకు అందుబాటులో ఉండే తత్వం ఆమె ప్రత్యేకత అని చెబుతున్నారు.ఈ నేపథ్యంలో మరొకసారి రాధారాణి చైర్మన్ పీఠం ఎక్కితే కొవ్వూరు రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అనుభవం ఉన్న నాయకురాలికే పార్టీలు అవకాశం ఇవ్వాలని, అదే కొవ్వూరు భవిష్యత్తుకు మంచిదని స్థానికులు, వ్యాపారవర్గాలు, మహిళా సంఘాల నుంచి కూడా డిమాండ్ వినిపిస్తోంది. మొత్తానికి రిజర్వేషన్ తో కొత్తవారికి అవకాశం వచ్చినా అనుభవానికి అభివృద్ధికి పెద్దపీట వేయాలంటే జొన్నలగడ్డ రాధారాణి మాత్రమే సరైన ఎంపిక అనే భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది

## వైకాపా మత్స్యకార కమిటీ అధ్యక్షుడిగా ఈశ్వరయ్య.



**ముత్తుకూరు, అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి)** నేలటూరు పాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మత్స్యకార గ్రామ కమిటీ విభాగం అధ్యక్షుడిగా బి ఈశ్వరయ్య నియామకంకావడం జరిగింది. రాష్ట్ర మాజీ మంత్రి జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి నియామకం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో నియామకం జరిగినట్లు స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భక్తాని కనకయ్య, బసవంగారి ఈశ్వరయ్య సంయుక్తంగా సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మత్స్యకార కమిటీ విభాగం అధ్యక్షుడు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం విశేషంగా కృషి చేస్తామన్నారు. ఎన్నికల సత్తా చూపిస్తామని పేర్కొన్నారు.

# విలీన మండలాల సమస్యలపై..రాష్ట్ర జల వనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు,కి వివరిస్తే!..









**పోలవరం నిర్వాసితులకు సమస్యలు100% పరిస్కానికి సులభతరమౌతుంది!..**

**నిర్వాసితులు!..**

**వరరామచంద్రాపురం, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** ప్రతీ నియోజకవర్గంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి ,నిమ్మల రామానాయుడు, లాంటి శాసన సభ్యులు, ఉంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నీరంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, నియోజకవర్గం లో ఆయన చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే అందుకు నిదర్శనం. కామన్ మేన్ లా ప్రజలమధ్యలో ఉంటూ సైకిల్ తొక్కుతూ, నిత్యంఏదోఒక గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకొంటూ, ప్రజలతో మమేకంమౌతూ సామాన్య కార్యకర్తలా ఉండటం పసుపురంగు షర్టుధరించి, నిజమైన తెలుగుదేశం పార్టీ కార్యకర్త అంటే ఏలాఉండాలో నిమ్మల రామానాయుడు, నిచూసి నేర్చుకోవాల్సిందే, ఎంతఓపిక, ఎంతసహానం, ఎంత ఓదార్పు,ఇది కధా ప్రజలకు కావాల్సింది. గన్మెన్లు అవసరం లేని, ఏకైక మంత్రి, ఆర్భాటాలకు దూరంగా, సహాజత్వానికి దగ్గరగా, ఉండేరాష్ట్ర జలవనరుల శాఖమంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, అంటే అతి షేయోక్తి కాదేమో!.. మన విలీనమండలాల సమస్య నిజంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, దృష్టికి వెళ్తే!.. నిజంగా మనవిలీన మండలాల్లోని పోలవరం నిర్వాసితుల, ముఖ్యంగా రేఖపల్లి,పంచాయతీ గురుంచి తెలిస్తే క్లుప్తంగా చెప్పగలిగితే "లేడార్" సర్వే తప్పులతడక గత ప్రభుత్వంలో చేశారని మంత్రి నిమ్మల రామానాయుడు,కి తెలిస్తే భూములు కోల్పోయి చుట్టూ నీరు ఉండి రహాదారి లేని రేఖపల్లి పంచాయతీ,లో పోలవరం సర్వేకి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జల వనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు, తప్పకుండా న్యాయం చేస్తారని ప్రజలు విశ్వశిస్తున్నారు. జలవనరుల శాఖ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ,కృషి అద్భుతమనే చర్చ జరుగుతోంది. సమర్ధవంతమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరుల అభివృద్ధికి, నీటి పారుదల మెరుగుదల, జలసంరక్షణ ప్రధాన్యమిస్తూ తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించడంతో పాటు ప్రతీ వర్షపు నీటి చుక్కను, రక్షించే దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని ఆయన అధికారిక కార్యక్రమాల్లో ప్రస్తావిస్తూ వస్తున్నారు. కష్టంవిలువ ఖచ్చితంగా మంత్రి నిమ్మల రామానాయుడు, తెలుసు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు, రేఖపల్లి,వాసుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్తే తప్పకుండా రేఖపల్లి, వాసులకు న్యాయం జరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. చుట్టూ నీరుఉండి రహాదారి లేకుండా రేఖపల్లి ప్రజల జీవనంఏలా? కొంతమంది ప్రశ్నలు సంధించారు.ఈవిషయం పై,జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకు వెళ్తే పరిస్థితి ఆశాజనకంగా ఉంటుందని,రేఖపల్లి ప్రజలు ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.ఏది ఏమైనా ప్రతీ నియోజకవర్గంలో డాక్టర్ నిమ్మల రామానాయుడు, లాంటి శాసన సభ్యులు ఉంటే నియోజకవర్గ అభివృద్ధి, నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగకరంగా ఉంటుందని ఏజెన్సీ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో జలవనరుల శాఖ సంబంధించిన పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు ఉన్నతాధి కారులతో సమీక్షలు నిర్వహిస్తూ నిర్ధేశించిన పనులను నాణ్యతతో పూర్తి చేసేవరకు పరిశీలిస్తూనే ఉంటారు. విలీన మండలాల సమస్యలు పోలవరం ప్రాజెక్టువల్ల ఇబ్బందులు, పనులు లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు, సకాలంలో పంటలు వేసే పరిస్థితి లేక రైతులు, ఈ అన్నీ సమస్యలకు పరిస్కారం ఒక్కటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జలవనరుల, శాఖమంత్రిని కలిసిరేఖపల్లి సమస్యలు వివరిస్తే తప్పకుండాపరిష్కరం లభిస్తుందని పలువురు నేతలు బహిరంగంగా చెప్పడం విశేషం.

# ఎన్నికలకు సమాయత్తం కావాలి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి







**సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్**

**తోటపల్లిలో సీపీఎం మండల విస్తృత స్థాయి సమావేశం**

**అన్ని స్థానాల్లో ఒంటరిగానే పోటీ: నేతల స్పష్టం**

**ఎటపాక, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి):**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని, పార్టీ అభ్యర్థుల గెలుపే ఏకైక లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని తోటపల్లిలో సోందే రామారావు అధ్యక్షతన సీపీఎం మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బొప్పెన కిరణ్ మాట్లాడుతూ... రానున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో ఎర్రజెండాను రెపరెపలాడించేం దుకు ప్రతీ కార్యకర్త నడుం బిగించాలన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు, పోడు భూములకు పట్టాల సాధన, 1/70 చట్ట పరిరక్షణ, జీవో నెం.3 పునరుద్ధరణ కోసం సీపీఎం సాగించిన రాజీలేని పోరాటాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యలపై సీపీఎం చేపట్టిన మోటార్ సైకిల్ యాత్ర, ర్యాలీలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ప్రజల పక్షాన నిలిచేది కేవలం సీపీఎం మాత్రమేననే విశ్వాసం వారిలో నెలకొందన్నారు. ఆ నమ్మకమే రాబోయే ఎన్నికల్లో ఓట్ల రూపంలో మారుతుందని, అన్ని స్థానాల్లో పార్టీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**అన్ని స్థానాల్లోనూ పోటీ: మర్లపాటి**

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... మండలంలో ప్రధాన పార్టీల జయాపజయాలను శాసించే సత్తా సీపీఎంకు ఉందన్నారు. గత చరిత్రను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుందని, అయితే ఈసారి ఏ పార్టీతోనూ పొత్తు లేకుండా స్వతంత్రంగా, పార్టీ గుర్తుపైనే బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

**ఉద్యమకారులే ప్రజాప్రతినిధులు కావాలి: లోతా రామారావు**

జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలలో అగ్రభాగాన నిలిచే సీపీఎం నేతలు చట్ట సభలు, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పుడే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గతంలో మండలంలో మెజారిటీ స్థానాలను సీపీఎం కైవసం చేసుకుందని, మళ్లీ ఆ వైభవాన్ని పునరావృతం చేసేలా కార్యకర్తలు చెమటోడ్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఐ.వెంకటేశ్వరరావు (ఐవి), మండల కమిటీ సభ్యులు పి.బాలకృష్ణ, ఇరప అజయ్, పూనెం వెంకట్రావు, బుద్దుల భద్రయ్య, గద్దల హుస్సేన్, పొడియం రత్తమ్మ, సవలం రాము, జంగిలి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం**

**ఎదుట 27వ రోజు రిలే నిరాహారదీక్ష.**




**ఆలమూరు అక్టోబర్ 12(ప్రజాజ్యోతి):**గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏల) న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆలమూరు మండల వీఆర్ఏల సంఘం ఆధ్వర్యంలో సోమవారం 27వ రోజు రిలే నిరాహారదీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రం ఆలమూరు లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న ధర్నా చౌక్‌లో ఈ నిరసన కార్యక్రమం కొనసాగింది.ఈ సందర్భంగా ఆలమూరు మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇస్సాక్ మాట్లాడుతూ, వీఆర్ఏలకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న తరహాలో పే స్కేల్ అందించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉండగా లేదా ఇతర కారణాలతో మరణించిన వీఆర్ఏల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి కారుణ్య నియామకం కల్పించి, ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి, తమ న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ రిలే నిరాహారదీక్ష కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తాతపూడి ఇస్సాక్, కార్యదర్శి కంతేటి శివరామారావు, ఉపాధ్యక్షుడు భువనగిరి ఏసు, సలహాదారు గూనపల్లి నాగేశ్వరరావు, కోశాధికారి కుందేటి శ్రీను, సభ్యులు యార్లగడ్డ జీవరత్నం, ఏడిద వెంకటాద్రి, బూరిగ మంగాలక్ష్మి, చోడవరపు రామలక్ష్మి, కోట లక్ష్మి, షేక్ బషీర్ బీబీతో పాటు మండలంలోని పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లోనూ ప్రైవేట్ వేధింపులు

### డీఈఓ ఆదేశాలను బేఖాతర్ చేసిన కాలేజీలు

### - ఏఐఎస్ఎఫ్ తీవ్ర ఆగ్రహం

### కాశినాయన, కలసపాడు,

**పోరుమామిళ్ల, అక్టోబర్ 12(ప్రజా జ్యోతి ప్రతినిధి)** పోరుమామిళ్ల ప్రభుత్వ నిబంధనలను, విద్యాశాఖాధికారుల ఆదేశాలను ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయి. కడప జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) శంషుద్దీన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వాటిని బేఖాతర్ చేస్తూ దసరా సెలవుల్లోనూ క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్న ప్రైవేట్ కాలేజీల తీరుపై అఖిల భారత విద్యార్థి సమాఖ్య తీవ్రంగా మండిపడింది.ఈ మేరకు కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాల్లోని ప్రైవేట్ విద్యా సంస్థల తీరును ఖండిస్తూ ఏఐఎస్ఎఫ్ నాయకులు జెబిఉల్లా, చందు విలేకరుల సమావేశం నిర్వహించారు.

**ప్రధాన ముఖ్యాంశాలు:**

**డీఈఓ ఆదేశాలకు తూట్లు:** అక్టోబర్ 10 నుండి 21వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయని డీఈఓ పత్రికా ప్రకటన ద్వారా జిల్లా వ్యాప్తంగా స్పష్టం చేసినా, ప్రైవేట్ యాజమాన్యాలు వాటిని పట్టించుకోలేదు.

**నిబంధనలు ఉల్లంఘిస్తున్న సంస్థలు:**

**కాశినాయన మండలం:** ఓబులాపురంలోని అశోక్ కుమార్ రెడ్డి స్కూల్

**కలసపాడు మండలం:** షిరిడి సాయి ఐటీఐ కాలేజ్

**పోరుమామిళ్ల మండలం:** మరికొన్ని ప్రైవేట్ కళాశాలలు డీఈఓ ఆదేశాలను లెక్కచేయకుండా తరగతులు నిర్వహిస్తున్నాయి.

**అధిక ఒత్తిడి - ప్రాణాలకే ముప్పు:** సెలవు రోజుల్లోనూ తరగతుల పేరుతో విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేయడం వల్ల వారి మేధస్సు దెబ్బతింటోందని, ఒత్తిడిని తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలపాలవుతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఏఐఎస్ఎఫ్ హెచ్చరిక:**

"మాకు నిబంధనలతో సంబంధం లేదు... మా ఇష్టమే చట్టం" అన్నట్లు వ్యవహరిస్తున్న యాజమాన్యాల వెనుక ఆంతర్యం ఏమిటని ఏఐఎస్ఎఫ్ ప్రశ్నించింది. సెలవుల్లోనూ క్లాసులు నిర్వహిస్తే ఊరుకునేది లేదని, కాలేజీలు జరిగే సమయంలో నేరుగా అడ్డుకుంటామని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆయా కాలేజీలు, స్కూళ్ల గుర్తింపును (పర్మిషన్) వెంటనే రద్దు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు నాయబ్, షావుల్, మహి, వసీం, ఖాజాహుస్సేన్, షావాజ్ తదితరులు పాల్గొన్నారు.




# పాపి కొండల పర్యటకాన్ని ప్రారంభించాలి!..

**పర్యాటకం వ్యాపారం కాదు!..సుమారు1000 కుటుంబాలకు ఉపాధి!..**

**ప్రస్తుతం పాపికొండల విహారం ఎప్పుడు మొదలవుతుందాని ఎదురు చూపు!..**











**వరరామచంద్రాపురం, అక్టోబర్ 12 (ప్రజాజ్యోతి ప్రతినిధి)** పాపికొండల పర్యాటకులకు నిరాశే?దయచేసి అధికారులు దీన్ని వ్యాపారంగా చూడొద్దని,ఈ పాపికొండల విహారయాత్ర ద్వారా సుమారు1000 కుటుంబాలు జీవనోపాధి కలుగుతుందని, పర్యటకం పై ఆధారపడి జీవించే నిరుపేద కుటుంబాలు ఎన్నో!.. సుమారు 4 నెలల క్రితమే పర్యాటకం అధికారులు నిలిపివేశారు. పనులు ఆటో, మ్యాజిక్, డ్రైవర్లు పూటగడవని పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్రీ బస్ కారణంగా పరిస్థితి దారుణంగా ఉందని, ఏజెన్సీ ప్రాంతంలో ఎంతో పేరున్న, టూరిజం, పాపికొండల విహారయాత్ర, దసరా, సందర్భంగా మొదలైతే ఎన్నో కుటుంబాల్లో నిజమైన పండుగ వాతావరణం లేకుంటే అర్థాకలితో ఇబ్బందులు తప్పవని నిట్టూర్పుతో నిరాశ చెందుతున్నారు. క్యాటరింగ్, వాళ్ళు, సప్లైర్స్, డ్రింకుషాపులు, స్వీట్స్ బండ్లు, మొక్కజొన్న కండెలు, బఠానీ, పాప్కార్న్, వాటర్ బాటిల్స్ గైడ్స్, ఇలాఎన్నో కుటుంబాలు, ఈ పాపికొండల టూరిజం పై ఆధారపడి జీవిస్తున్నాయి. గోదావరి, శబరి,నదుల వరదలను దృష్టిలో పెట్టుకొని 4 నెలల క్రితమే టూరిజం ఆపారని, ప్రస్తుతం ఇంకా చిక్కుముడి వీడలేదని నిరాశ నిస్పృహుళమధ్య,ఎన్నో కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని అధికారులు దసరా సెలవులను దృష్టిలో పెట్టుకొని, పర్మిషన్ ఇవ్వాలని, అప్పుడే టూరిజంపై ఆధారపడి జీవించే ఎన్నో కుటుంబాలు నిజమైన దసరా జరుపుకునే అవకాశాలు ఉన్నాయని, లేకుంటే అర్ధాకలితో సుమారు1000 కుటుంబాలు ఇబ్బందులు పడతాయని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ఏది ఏమైనా అధికారులు చొరవ చూపాలని పాపికొండల విహారయాత్ర పై జీవించే నిరుపేద కుటుంబాలు వేడుకుంటున్నాయి.

# ఏలేశ్వరంలో రూ.61.84 కోట్లతో ఇంటింటికీ తాగునీటి పథకం ఎమ్మెల్యే సత్యప్రభ

### --8,987 కుటుంబాలకు శుద్ధి చేసిన తాగునీరు..

### --శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సత్యప్రభ,

### జనసేన నేత మేడిశెట్టి బాబీ

**కాకినాడ జిల్లా అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ఏలేశ్వరం మున్సిపాలిటీ పరిధిలో రూ.61.84 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఇంటింటికీ తాగునీటి పథకానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెడిశెట్టి బాబి శంకుస్థాపన చేశారు. ఆసియా మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు (ఏఐఐబీ) నిధులతో ఈ పథకాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా పట్టణంలోని 8,987 కుటుంబాలకు సురక్షితమైన తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. ఏలేరు జలాశయం నుంచి రోజుకు 32 లక్షల లీటర్ల నీటిని ఫిల్టర్ బెడ్‌కు తరలించి శుద్ధి చేయనున్నట్లు వివరించారు. అనంతరం 16.50 లక్షల లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని రెండు ట్యాంకుల ద్వారా నిల్వ చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. పథకం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే పట్టణంలో తాగునీటి సమస్యకు ఉపశమనం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ఏలేశ్వరం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యప్రభ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యుడు పర్వత సురేష్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మూది నారాయణస్వామి,నాయకులు బొదిరెడ్డి గోపి, అలమండ చలమయ్య, పెంటకోట మోహన్, బద్ది రామారావు, గంటిమల్ల రాజ్యలక్ష్మి, మామిడి లలిత, రుచి రమేష్, ఎండగుడి నాగబాబు, కోనాల వెంకటరమణ, యిటంశెట్టి భాస్కర్ బాబు, బస్సా మహాలక్ష్మి ప్రసాద్, మైరాల కనకారావు, సామంతుల గోపి, కరోతు గాంధీ, పలివెల వెంకటేశ్వరరావు, పలివెల శ్రీనివాస్, పలివెల వెంకటేష్, వైబోగుల సుబ్బారావు, నూకతాటి ఈశ్వరుడు, సత్యంశెట్టి సీతారామ్, గట్టెం వెంకటరమణ, అవసరాల సూర్యప్రకాశరావు, వనం మంగ, దొంతంశెట్టి శైలజ, పతివాడ అఖిలేష్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



## నేలటూరు పాలెం లో గుర్తింపు కార్డులు పంపిణీ.

**ముత్తుకూరు, అక్టోబర్ 12( ప్రజా జ్యోతి)** నేలటూరు పాలెం గ్రామంలో సోమవారం రాత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని పార్టీ నాయకత్వం నిర్వహించింది. రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి సహకారంతో కార్యకర్తలకు ఈ గుర్తింపు కార్డులు మంజూరు కావడం జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు ఈపూరు కోటారెడ్డి, ఈపూరు గిరిధర్ రెడ్డి, యువ నాయకులు జానకిరామిరెడ్డి సమక్షంలో స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భక్తాని కనకయ్య, బసవంగారి ఈశ్వరయ్య అందజేశారు. గుర్తింపు కార్డులతో పార్టీలో మంచి స్థానం కలిగి ఉంటారని పార్టీ సీనియర్ నాయకులు తెలియజేశారు. గుర్తింపు కార్డులు పొందిన వారందరినీ నాయకత్వం అభినందించింది. ఈ



కార్యక్రమంలో పార్టీ సీనియర్ కార్యకర్తలు షేక్ మౌలాలి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## జనగణన వివరాల నమోదులో కచ్చితత్వం పాటించాలి

### అధికారులకు కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశం




**బాపట్ల అక్టోబర్ 12 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జనగణన ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా ప్రతి కుటుంబ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వాసుదేవా అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో జనగణన రెండో దశపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన దేశ, రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలకు కీలకమని, ఈసారి కుల గణన కూడా సమాంతరంగా నిర్వహించనున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన చేపట్టనున్నట్లు తెలిపారు. కుటుంబ యజమానులు అందించిన సమాచారాన్నే నమోదు చేయాలని, ప్రజల్లో అవగాహన కల్పించి వారి సహకారం పొందాలని సూచించారు.2027 జనవరి 10 నుంచి 24 వరకు స్వీయ జనగణనకు వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.జనగణన జిల్లా సహాయ సంచాలకులు ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, సంచార జాతులు, నిరాశ్రయులు, పడవల్లో నివసించేవారిని సైతం జనగణనలో చేర్చాలని సూచించారు. వృత్తులు, వలసలు, డిజిటల్ అక్షరాస్యత, పిల్లల జననాల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఆర్డీవోలు హరికుమార్, నరసింహారావు, శ్రీదేవి, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల శాంతిభద్రల పరిరక్షణకై పోలీసుల ఫ్లాగ్ మార్చ్



**తాళ్లపూడి ,అక్టోబర్ 12 , ప్రజాజ్యోతి న్యూస్** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు కొవ్వూరు డి ఎస్పి దేవకుమార్, సీఐ విజయ బాబు పర్యవేక్షణలో తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ మరియు పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సుమారు 30 మంది పోలీసు సిబ్బందితో తాళ్లపూడి ప్రధాన రహదారిపై ఈ ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా పాత నేరస్తులను బైండోవర్ చేయడం జరుగుతుందని అన్నారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నిరంతరంఅప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు

## ఎండతో పనిలేకుండా మామిడి తాండ్ర తయారీ!

### సోలార్ పాలీ హౌస్‌తో దుర్గాడ మహిళా పారిశ్రామికవేత్త సునీత వినూత్న ప్రయోగం

**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** సాంప్రదాయ మామిడి తాండ్ర తయారీకి ఆధునిక సాంకేతికతను జోడించి గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన మహిళా పారిశ్రామికవేత్త కోరుమిల్లి సునీత వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా నాణ్యమైన మామిడి తాండ్ర తయారు చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ పథకాల సహకారంతో రూ.35 లక్షల వ్యయంతో సోలార్ పాలీ హౌస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ యూనిట్ ద్వారా పరిశుభ్రమైన వాతావరణంలో మ్యాంగో జెల్లీ ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.సాధారణంగా వర్షాకాలం, చలికాలంలో తగినంత ఎండ లేకపోవడంతో మామిడి తాండ్ర తయారీకి ఆటంకాలు ఏర్పడుతుంటాయి. దీంతో చిన్న వ్యాపారులు నష్టాలను ఎదుర్కొంటుంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా సునీత సోలార్ పాలీ హౌస్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ విధానంలో బయటి వాతావరణంతో పోలిస్తే లోపల అధిక ఉష్ణోగ్రత ఉండటంతో సుమారు 15 రోజుల్లోనే మామిడి తాండ్ర తయారీ పూర్తవుతుందని తెలిపారు.ఈ యూనిట్ ద్వారా స్వయం ఉపాధి పొందడంతో పాటు 50 మందికి పైగా ఉపాధి కల్పిస్తున్నారు. వీరిలో 25 మందికి పైగా మహిళలు ఉండటం విశేషం. మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించేందుకు ఈ తరహా యూనిట్లు దోహదపడుతున్నాయి.ఇటీవల కాకినాడలో నిర్వహించిన సీఐఐ పాంతీయ సదస్సు తమ ఉత్పత్తులకు మార్కెట్ విస్తరించేందుకు, మరింత మంది వినియోగదారులకు చేరువయ్యేందుకు ఎంతగానో ఉపయోగపడిందని సునీత తెలిపారు. సదస్సు నిర్వహణ అద్భుతంగా ఉందని ఆమె హర్షం వ్యక్తం చేశారు.



# పాపికొండల పర్యటన బోట్లకు తనిఖీలు.. చేసిన.. ప్రాజెక్టు అధికారి(పి. ఓ ).నరేంద్ర పడాల్!..





**వరరామచంద్రాపురం,అక్టోబర్ 12(ప్రజాజ్యోతి ప్రతినిధి)** పాపికొండల పర్యాటకానికి వచ్చే సందర్శకుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ బోట్ల తనిఖీ,అనుమతుల మంజూరు ప్రక్రియను అధికారులు చేపట్టారు.పాపికొండల పర్యటనకు వినియోగించే బోట్ల పనితీరు,భద్రతా ప్రమాణాలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగాఉన్న బోట్లకు అనుమతులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ప్రస్తుతం సుమారు 20 బోట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పర్యాటక కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.బోట్ల సామర్థ్యం, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలను పరిశీలించడం ద్వారా పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నది లక్ష్యంగా పేర్కొన్నారు.పాపికొండల ప్రకృతి అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.ఈ నేపథ్యంలో బోట్ల నిర్వహణలో భద్రతా నిబంధనలు పాటించడం, ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యాలు కల్పించడం అత్యంత ముఖ్యమని అధికారులు భావిస్తున్నారు. తనిఖీల అనంతరం నిబంధనలకు అనుగుణంగా ఉన్నబోట్లకు అనుమతులు మంజూరుచేసి, పర్యాటక సేవలను క్రమబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఈకార్యక్రమంలో సబ్ కలెక్టర్,ఐ.టీ.డీ.ఏ ప్రాజెక్టు అధికారి (పీ.ఓ.) నరేంద్ర పడాల్,తో వరరామచంద్రాపురం, తహసీల్దార్ సరస్వతి,డీఎస్పీ ఉదయ పావని,ఎస్సై ఎస్.కె సాధిక్,ఆర్.ఐ మడకం రామకృష్ణ,బోట్ యజమానులు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు వైఎస్సార్‌సీపీ సర్వసభ్య సమావేశం.. పార్టీ కార్యాలయం ప్రారంభించిన వంగా గీత విశ్వనాథ్







**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** పిఠాపురం నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ ఆధ్వర్యంలో సోమవారం గోల్లప్రోలు సురేష్ కళ్యాణ మండపంలో వైఎస్ఆర్సిపి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా గీతావిశ్వనాథ్ మాట్లాడుతూ, త్వరలో జరగబోయే మున్సిపల్ ఎలక్షన్స్ కి ప్రతి ఒక్కరు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రతి వార్డుకి ఐదుగురు చొప్పున కమిటీని ఏర్పాటు చేసుకోవాలని అలాగే మన పెద్దలందరూ కూర్చుని మున్సిపల్ ఎలక్షన్ లో పోటీ చేసే అభ్యర్థులను, వాళ్ళ అభిప్రాయం మేరకు నియమించడం జరుగుతుందని, వంగా గీత తెలిపారు. అనంతరం వైఎస్ఆర్సిపి గొల్లప్రోలు పట్టణ అధ్యక్షుడు మైను రాజా ఆధ్వర్యంలో గొల్లప్రోలు లో వైఎస్ఆర్ సీపీ పార్టీ కార్యాలయంను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు మైనం రాజా మాట్లాడుతూ గొల్లప్రోలు పట్టణంలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ సర్వసభ్య సమావేశం, పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి పార్టీ నాయకులు,మాజీ వార్డు కౌన్సిలర్లు, వార్డ్ ఇంచార్జిలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని, కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు, పార్టీ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని మైనం రాజా పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం సహకరించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. గొల్లప్రోలు పట్టణంలో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పార్టీ జెండా ఎగురవేసే లక్ష్యంతో సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్టులు



**డోన్ ప్రజా జ్యోతి అక్టోబర్ 12** నంద్యాల జిల్లాడోన్ పట్టణం లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల పరిరక్షణ సమితి నాయకులు రాష్ట్ర మాజీ ఆర్థిక శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయనకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. మొదటిసారి రాష్ట్ర, నియోజకవర్గ నాయకు లు.సమితి ఏర్పాటు లక్ష్యాలు, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు చేపట్టనున్న కార్యక్రమా లు, పాత్రికేయుల సంక్షేమం కోసం భవిష్యత్తులో అమలు చేయనున్న కార్యాచరణను వివరించారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడమే సమితి ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయులు నిరంతరం కృషి చేస్తున్నారని ఏపీ జేపీఎస్ నాయకులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమితి ప్రత్యేక దృష్టి సారిస్తుందని వివరించారు. జర్నలిస్టులకు అండగా నిలుస్తూ, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేయడం, రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను సంఘటితం చేయడం, వారి హక్కులు, సంక్షేమం కోసం అవసరమైన కార్యక్రమాల ను రూపొందించడం వంటి అంశాలను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి వివరించారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమితి చేపట్టనున్న కార్యక్రమాల గురించి తెలియజేస్తూ, భవిష్యత్తులో మరింత సమన్వయంతో ముందుకు సాగనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎం. శివరామయ్య చారి, రాష్ట్ర కార్యదర్శి విజయ్, జాయింట్ కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి జయకర్, యాగంటి, రంగన్న గౌడ్, డోన్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు జెర్మియా, కార్యదర్శులు సుధాకర్, కోశాధికారి శ్రీనివాస్ యాదవ్, ప్రవీణ్, వలసల సుధాకర్, తోపురెడ్డి కృష్ణారెడ్డి, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# డాలర్‌పై రూపాయి దూకుడు.. ఆరు నెలల్లోనే అతిపెద్ద ర్యాలీ!




**ముంబై:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి సోమవారం గణనీయంగా బలపడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న చర్యల నేపథ్యంలో రూపాయి విలువ సుమారు ఒక శాతం పెరిగి డాలర్‌కు రూ.95.77 స్థాయికి చేరింది. అంతకుముందు ఇది రూ.96.73 వద్ద ఉండగా, ఒక్కరోజులోనే గణనీయమైన మార్పు నమోదైంది. గత ఆరు నెలల్లో రూపాయికి ఇదే అతిపెద్ద ఒక్కరోజు ర్యాలీగా వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

**ఆర్‌బీఐ చర్యల ప్రభావం**

విదేశీ మారక మార్కెట్‌లో డాలర్ల డిమాండ్‌ను నియంత్రించేందుకు ఆర్‌బీఐ పలు చర్యలు చేపట్టింది. చమురు కంపెనీల డాలర్ల కొనుగోళ్లను స్పాట్ మార్కెట్ నుంచి ఇతర మార్గాలకు మళ్లించే చర్యలు, కొన్ని విదేశీ మారక రిస్క్ హెడ్జింగ్ నిబంధనలను కఠినతరం చేయడం ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ చర్యలతో డాలర్లపై తక్షణ డిమాండ్ తగ్గి రూపాయికి మద్దతు లభించవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

**దిగుమతిదారులకు ఊరట?**

భారత్ ముడిచమురు అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. రూపాయి బలపడితే ఇతర పరిస్థితులు మారకపోతే దిగుమతుల రూపాయి వ్యయంపై కొంత ఉపశమనం లభించవచ్చు. అయితే అంతర్జాతీయ చమురు ధరలు పెరిగితే ఆ ప్రయోజనం కొంత తగ్గే అవకాశం ఉంది. విదేశీ విద్య, ప్రయాణం, దిగుమతి ఆధారిత వ్యాపారాల ఖర్చులపై కూడా మారకం విలువ ప్రభావం చూపుతుంది.

**సవాళ్లు ఇంకా ఉన్నాయి**

రూపాయి ఒక్కరోజులో బలపడినప్పటికీ, దీర్ఘకాలికంగా దాని దిశ అంతర్జాతీయ చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, అమెరికా డాలర్ బలం, దేశీయ ఆర్థిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి తాజా పెరుగుదలను రూపాయి సమస్యలన్నీ పరిష్కారమైనట్లు భావించకూడదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

ముగింపు: ఆర్‌బీఐ చర్యలతో రూపాయికి తాత్కాలికంగా ఊరట లభించింది. అయితే ఈ బలం కొనసాగుతుందా లేదా అన్నది రాబోయే రోజుల్లో విదేశీ మారక మార్కెట్ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ హెచ్చరిక



**గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. పిఠాపురం సీఐ జి.వి.వి. సత్యనారాయణ ఆదేశాల మేరకు సోమవారం గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల ఓటర్లతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమ నిబంధనలు, ప్రవర్తనా నియమావళి పై ఓటర్లకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనవసర వివాదాలు, ఘర్షణలకు పాల్పడరాదని స్పష్టం చేశారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడి కేసులు నమోదైతే, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు.. తదుపరి ఎన్నికల సమయంలోనూ బైండోవర్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా సహకరించాలని గొల్లప్రోలు ఎస్. ఐ నౌడ్ విజ్ఞప్తి చేశారు.

## ఒంటారెడ్డిపల్లి గ్రామంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురికి నీరు: తహసిల్దార్ కు ఫిర్యాదు



**కంబదూరు అక్టోబర్:12(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,**సంబదూరు మండలంలోని ఒంటారెడ్డిపల్లి గ్రామంలో మురికి కాలువ మార్గం సరిగా లేక , ప్రజలు వాడుకుని వదిలిన మురికి నీరంతా రోడ్ల పై సెలయేరులా ,జీవ నదిలో ప్రవహిస్తూ , దుర్గందం వెదజల్లుతుందని ఆ గ్రామ వాసి నిరంజన్ సోమవారం తహసీల్దార్ కార్యాలయం నందు జరిగిన ప్రజా పిర్యాదుల దినోత్సవం సందర్భంగా స్థానిక తహసీల్దార్ బాలకిషన్ కు పిర్యాదు చేశారు. ఈ సమస్య గత 10 సంవత్సరాలుగా ఉందని, ఈ విషయమై అనేక మార్లు వ్యక్తిగతంగా, రాత పూర్వకంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా,స్పందించి పరిష్కారానికి కృషి చేయలేదని ఆయన అవేదన వెలిబుచ్చారు.ప్రజా ప్రయోజనాల దృష్ట్యా గ్రీవెన్స్ లో వినతి పత్రాన్ని సమర్పించానని ఆయన తెలిపారు. మురుగు నీరు రోడ్ల పై ప్రవహించకుండా చూడాలని ఆయన కోరారు. మురుగు నీరు రోడ్ల పై పారడం తో ,నిల్వ ఉండటం తో దోమలు వృద్ధి చెంది ప్రజా రోగ్యం దెబ్బతింటుందని ఆయన అవేదన వెలిబుచ్చారు.మురుగు నీటిని గ్రామం బయటకు తీసుకెళ్లే విధంగా నిర్మాణ పనులు చేపట్టాలని ఆయన విన్నవించుకున్న వినతిపత్రంలో కోరారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు..



**నందవరం, అక్టోబర్ 13(ప్రజా జ్యోతి):** మండల పరిధిలో ని ముగతి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ గుణశేఖరమ్మ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు అలాగే ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే సమస్యల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీపీఎస్ నరసింహులు, ఏఎన్ఎం శ్వేత, ఎంపీహెచ్ఓ మాణిక్యమ్మ, ఐసీడీఎస్ పాల్గొన్నారు.

## టీడీపీని వీడి లో చేరికలు,



**డోన్ ప్రజా జ్యోతి అక్టోబర్ 12** మండల పరిధిలోని నక్కలవాగుపల్లిగ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మల కిష్టన్నయాదవ్,ఆయన అనుచరులు తుమ్మల గోపాల్ యాదవ్, తుమ్మల జనార్దన్ యాదవ్, షేక్ అస్సేన్ వలి సాహెబ్ కుమారుడులు సోమవారం పట్టణంలోని కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో పార్టీలోచేరారు. మాజీ మంత్రివర్యులు బుగ్గ రాజేంద్రనాథ్ రెడ్డి¯హా=జూ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో నక్కలవాగు పల్లి గ్రామ నాయకులు భాస్కర్ రెడ్డి, మురళీధర రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఇస్మాయిల్, సోమయ్య యాదవ్, వీ. మనోహర్, రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల్లో ఓటమి.. కాంగ్రెస్ సీరియస్!

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు సంఘం ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అక్టోబర్ 9న ముగిసిన ఆర్టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు తెలిపిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూ) ఓటమి పాలైనట్లు సమాచారం. దీంతో ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహంతో ఉంది. ముఖ్యంగా ఏఐటీయూసీ మద్దతుతో బరిలోకి దిగిన ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) విజయం సాధించడం, అధికార పార్టీకి మింగుడుపడడం లేదు. ఈ పరిణామంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల ఉదాసీనత వల్లే ఆర్టీసీ ఎన్నికల్లో ఓడిపోయినట్లు కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కార్మికులను తమ వైపు తిప్పుకోవడానికి, అధికారంలో ఉన్నామనే ధీమాతో టీడబ్ల్యూయూని గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, సంబంధిత మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ యూనియన్ గెలుపు కోసం కృషి చేయాలని పార్టీ అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీ ఎమ్మెల్యేలు ఈ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోలేదని, ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ కార్మికులను మమేకం చేయడంలో, స్థానిక సమస్యలపై స్పందించడంలో ప్రజాప్రతినిధులు విఫలమయ్యారంటూ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ అధికారంలో ఉండి కూడా కార్మిక సంఘం ఎన్నికల్లో ఓడిపోవడం పట్ల ఆయన నేతల తీరును తప్పుబట్టారు. అక్టోబర్ 17న అధికారికంగా వెలువడనున్న ఈ ఎన్నికల తుది ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి రాబోయే కాలంలో ఎదురుకాబోయే సవాళ్లకు అద్దం పడుతున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, జీహెచ్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఆర్టీసీ కార్మిక యూనియన్ ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగలడం పార్టీ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. కార్మిక రంగంలో పట్టుకోల్పోవడం భవిష్యత్తు రాజకీయాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన పార్టీ అధిష్టానంలో వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు మధ్య సమన్వయం కొరవడుతోందనడానికి ఈ ఘటనే నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు కేవలం పదవులకే పరిమితమై పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పార్టీ గట్టి సంకేతాలు పంపుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ



అధిష్టానం అంతర్గత ప్రక్షాళనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో పార్టీ ఆదేశాలను బేఖాతరు చేసిన వారిపై, బాధ్యతారహితంగా వ్యవహరించిన ఎమ్మెల్యేలపై జిల్లాల వారీగా నివేదికలు తెప్పించుకుని చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. ఏది ఏమైనప్పటికీ, ఆర్టీసీ ఎన్నికల వేడి తెలంగాణ కాంగ్రెస్‌లో వర్గపోరును, నాయకుల పనితీరులోని లోపాలను బట్టబయలు చేసిందనే చెప్పాలి.

**కాంగ్రెస్ ప్రభుత్వానికి వార్నింగ్ బెల్స్!?**

తెలంగాణలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఊహించినదానికి భిన్నంగా ఈ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కాంగ్రెస్ పార్టబలపరిచిన యూనియన్లకు ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపించే ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీ ఓటమి చవిచూడడం పట్ల పార్టీ శ్రేణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి ఇవి వార్నింగ్ బెల్స్ లాంటివని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా వ్యతిరేకతకు ఇవి అద్దం పడుతున్నాయని, అప్రమత్తం కాకపోతే కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు తప్పవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్టోబర్ 9న ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు జరిగాయి. వీటిని కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తాము మద్దతు ఇచ్చిన తెలంగాణ వర్కర్స్ యూనియన్ , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ కూటమి విజయం సాధించాలని భావించింది. అయితే? సీపీఐ బలపరిచిన ఎంప్లాయిస్ యూనియన్ , తెలంగాణ మజ్దూర్ యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ కూటమి ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. రాష్ట్ర స్థాయిలో క్లాస్-3 విభాగంలో సీపీఐ అనుబంధ యూనియన్ అయిన ఎంప్లాయిస్ యూనియన్ 18,250 ఓట్లను సాధించగా, కేవలం 13,670 ఓట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ఎంప్లాయిస్ యూనియన్ సుమారు 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని నమోదు చేసింది. అలాగే ప్రాంతీయ స్థాయిలో క్లాస్-6 విభాగంలో 13,907 ఓట్లను సాధించింది. ఈ ఎన్నికల ఫలితాలు కేవలం యూనియన్లకే పరిమితం కాలేదు.. రాజకీయంగా ఇది అధికార పార్టీకి పెద్ద హెచ్చరికగా మారింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కాంగ్రెస్ మద్దతు కూటమి కేవలం 3 యూనిట్లను మాత్రమే గెలవడం పార్టీ నేతలను విస్మయానికి గురిచేసింది. పలు జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొనకపోవడం, కొందరు నేతలు ప్రత్యర్థి యూనియన్లకు మద్దతు ఇవ్వడం వంటి ఆరోపణలు పార్టీలో అంతర్గత విభేదాలను బయటపెడుతున్నాయి. అక్టోబర్ 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ జరగనుండగా, అక్టోబర్ 17న అధికారిక తుది ఫలితాలు వెలువడనున్నాయి. అయితే మొత్తం 900 లోపే ఉన్న పోస్టల్ బ్యాలెట్లు ఇప్పటికే ఉన్న 4,580 ఓట్ల భారీ ఆధిక్యాన్ని మార్చలేవని స్పష్టమవుతోంది. ఈ పరిణామాలు కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను పునరాలోచనలో పడేశాయి. అనుబంధ సంఘాలతో సమన్వయం, ఆర్టీసీ ఉద్యోగులతో నిరంతర సంప్రదింపులపై పార్టీ నాయకత్వం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు సడలుతుందనే సంకేతాలు వెలువడుతున్న నేపథ్యంలో, రాబోయే రాజకీయ సవాళ్లను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ తన యంత్రాంగాన్ని సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బీఆర్ఎస్‌కు “భూమి” భారం

**హైదరాబాద్ :** తెలంగాణలో బీఆర్ఎస్ ఒకింత ఇబ్బంది కరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంది. అధికారంలో ఉన్న సమయంలో భూముల కొనుగోళ్లు ఇప్పుడు కాంగ్రెస్ చర్చ పెట్టడంతో ఒకింత ఆత్మరక్షణలో పడినట్లయింది. కేసీఆర్ నుంచి ఆయన కుటుంబ సభ్యులపై భూ ఆక్రమణల ఆరోపణలను కాంగ్రెస్ చేయడంతో దీనిని అధిగమించేందుకు ఎదురుదాడికి దిగుతున్నప్పటికీ అనుకున్న ఫలితం లభించడం లేదు. రాజకీయంగా మరియు న్యాయపరంగా చూస్తే, బీఆర్ఎస్ పార్టీ భూముల వ్యవహారంలో తీవ్రమైన ఆత్మరక్షణలో పడిందనే చర్చ గట్టిగా నడుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులు, పార్టీ కార్యాలయాల నిర్మాణాలు, మరియు కీలక నేతల వ్యక్తిగత భూములపై గట్టి నిఘా పెట్టడం ఇందుకు ప్రధాన కారణంగా చెప్పాలి. తెలంగాణలో భూములన్నీ... బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన భూ అక్రమాలు, 22-ం కేటాయింపులపై తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 2026లో ఒక నలుగురు సభ్యుల ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఇది పార్టీ నేతలను ఇరకాటంలోకి నెట్టింది. జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరలకు కేటాయించుకున్నారని, కొన్ని చోట్ల అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మించారనే ఆరోపణలపై న్యాయపరమైన చర్యలు నడుస్తున్నాయి. ఇప్పటికే నల్గొండ వంటి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన పార్టీ ఆఫీస్ భవనాలపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ విషయంలో బీఆర్ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో భూములను




తమ సొంతం చేసుకున్నారన్న అభిప్రాయం ప్రజల్లో బలపడేందుకు దోహదపడింది. రాజకీయాలు కేసీఆర్ కుటుంబానికి చెందిన గజ్వేల్ ఫామ్‌హౌస్ భూములు, అలాగే కేటీఆర్‌కు లింక్ ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జన్వాడ ఫామ్‌హౌస్ పరిసర భూములపై కాంగ్రెస్ ప్రతినిధుల బృందాలు స్వయంగా వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలనలు జరిపాయి. కేసీఆర్ కుటుంబానికి 9 జిల్లాల్లో దాదాపు 440 ఎకరాల భూములు ఉన్నాయని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆరోపించి విచారణకు ఆదేశించారు. ఈ ఆరోపణలన్నింటినీ రాజకీయ కక్ష సాధింపు చర్యలుగా బీఆర్ఎస్ కొట్టిపారేస్తోంది. ప్రభుత్వ భూముల తాకట్టుపై కాంగ్రెస్‌ను నిలదీస్తూ, సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ భూములపై కూడా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని హరీశ్ రావు, కేటీఆర్ లాంటి అగ్రనేతలు ఎదురుదాడికి దిగుతున్నారు. అయినప్పటికీ, అధికారికంగా ప్రభుత్వ విచారణలు, కోర్టుల నోటీసులు ఎదుర్కొంటుండటం వల్ల భూముల విషయంలో ప్రస్తుతానికి బీఆర్ఎస్ కొంత ప్రతికూల పరిస్థితుల్లోనే ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఐటీ ఉద్యోగులకు పాడ్ ట్యాక్సీ సదుపాయం..

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ప్రయాణికుల రవాణా వ్యవస్థను మరింత ఆధునికంగా మార్చేందుకు తెలంగాణ సర్కార్ కీలక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. మెట్రో రైలు దిగిన ప్రయాణికులు స్టేషన్ నుంచి బయటకు రాకుండానే డ్రైవర్ అవసరం లేని ‘పాడ్ ట్యాక్సీ’లోకి మారి నేరుగా తమ కార్యాలయాలకు చేరుకునేలా కొత్త రవాణా వ్యవస్థను ప్రతిపాదించింది. ఐటీ కారిడార్, నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, సచివాలయం పరిసరాలను అనుసంధానిస్తూ మొత్తం 40.82 కిలోమీటర్ల మేర పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పీఆర్‌టీ) నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. దీనికి సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదికను హైదరాబాద్ మెట్రో రైల్ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. ప్రాజెక్టు కోసం లీ అసోసియేట్స్ సంస్థ మూడు నెలల పాటు అధ్యయనం చేసింది. తొలుత 44.62 కిలోమీటర్లు, 56.88 కిలోమీటర్ల నెట్‌వర్క్ ప్రతిపాదనలను పరిశీలించి, వాటి ఆధారంగా 40.82 కిలోమీటర్ల హైబ్రిడ్ నెట్‌వర్క్‌ను అనుకూలంగా సూచించి నట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇందులో కూకట్‌పల్లి రాయదుర్గం మార్గంలో 7.62 కిలోమీటర్లు, రాయదుర్గం నాలెడ్జ్ సిటీ మార్గంలో 12.83 కిలోమీటర్లు, రాయదుర్గం/హైటెక్ సిటీ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మార్గంలో 14.01 కిలోమీటర్లు, సచివాలయం ఎన్టీఆర్ మార్గ్ కారిడార్‌లో 6.36 కిలోమీటర్ల మేర నెట్‌వర్క్ ఉండనుంది. ఈ



మార్గాల ద్వారా ఐటీ ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే ప్రయాణికులకు చివరి దశ రవాణా సదుపాయం కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. ఈ పాడ్ ట్యాక్సీ నెట్‌వర్క్‌ను దశలవారీగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. 2030 నాటికి 34.66 కిలోమీటర్లు, 2040 నాటికి 39.36 కిలోమీటర్లు, 2050 నాటికి పూర్తి నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రణాళిక. ఈ వ్యవస్థ ద్వారా రోజువారీ ప్రయాణికుల సంఖ్య 2030లో 5.42 లక్షలు, 2040లో 15.47 లక్షలు, 2050 నాటికి 20.31 లక్షలకు చేరవచ్చని నివేదిక అంచనా వేసింది. ప్రస్తుతం హైదరాబాద్ మెట్రోలోని 69 కిలోమీటర్ల మార్గంలో రోజుకు సుమారు ఐదు లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాడ్ ట్యాక్సీలు అందుబాటులోకి వస్తే మెట్రో స్టేషన్ల నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణం మరింత సులభమయ్యే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశంలో ముంబైలోని బాంద్రా?కుర్లా కాంప్లెక్స్ ప్రాంతంలోనూ పాడ్ ట్యాక్సీ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నారు. హైదరాబాద్ ప్రాజెక్టుకు సంబంధించి మొత్తం వ్యయం, ప్రయాణికుల టికెట్ ధరలు, నిర్మాణ పనుల ప్రారంభ తేదీ, పూర్తి చేసే గడువు ఇంకా వెల్లడికాలేదు. ఇవి ఖరారైన తర్వాతే ప్రాజెక్టు అమలు తీరుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రతిపాదిత నెట్‌వర్క్ కార్యరూపం దాల్చితే ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు మెట్రో నుంచి కార్యాలయాలకు చేరుకునే ప్రయాణికులకు ప్రత్యామ్నాయ రవాణా సదుపాయం అందుబాటులోకి రావచ్చు

## పాలకొల్లులో నేడు 365 మంది దివ్యాంగులకు మెగా ఉపకరణాల పంపిణీ.

**పాలకొల్లు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. అక్టోబర్ 12.** పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని 365 మంది దివ్యాంగులకు ఈ నెల 13 మంగళవారం ఉదయం 9గంటలకు పాలకొల్లు మార్కెట్ యార్డ్ గ్రౌండ్ వద్ద కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి శ్రీ నిమ్మల రామానాయుడు గారితో కలిసి అందచేయనున్నారు. ప్రదాని నరేంద్ర మోదీ గారి 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకునికేంద్ర ఉక్కు శాఖ ఆధ్వర్యంలోని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ నిధులతో 365 మంది దివ్యాంగులకు రూ. ఒక కోటి 10లక్షల విలువైన 530 ఉపకరణాలను అందచేయ్యనున్నారు.

## భక్తిశ్రద్ధలతో గంగవరం బోనాల జాతర!

**అమ్మవారి బోనాలతో మార్మోగిన గ్రామం..**

**భారీగా తరలివచ్చిన మహిళా భక్తులు**



**రౌతులపూడి, అక్టోబర్ 12, (ప్రజా జ్యోతి న్యూస్)** దేవి నవరాత్రుల సందర్భంగా కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం గంగవరం గ్రామంలో నిర్వహించిన బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుక గ్రామమంతటా భక్తి పారవశ్యాన్ని నింపింది. ఈ సందర్భంగా గంగవరం గ్రామానికి చెందిన మహిళలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. సంప్రదాయబద్ధంగా సాగిన బోనాల వేడుకలు, అమ్మవారి నామస్మరణలతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహిళా భక్తులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**గ్రామ ఐక్యతకు ప్రతీకగా బోనాల వేడుకలు**

మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భక్తిభావాన్ని భావితరాలకు అందించడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువత, గ్రామ ప్రజల సమష్టి సహకారంతో బోనాల జాతర విజయవంతంగా నిర్వహించబడింది. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని భక్తులు ఆకాంక్షించారు. భక్తి, సంప్రదాయం, గ్రామ ఐక్యతకు నిదర్శనంగా గంగవరం బోనాల జాతర నిలిచింది అని ఆలయ కమిటీ తెలిపారు

## ప్రశాంత ఎన్నికలే లక్ష్యం..

**గొడవలకు దూరంగా ఉండాలి...!**

**ఇంగలదహాల్‌లో పల్లె నిద్ర కార్యక్రమంలో ఎస్సై దిలీప్ కుమార్ అవగాహన**



**హొళగుంద, అక్టోబర్ 12, ప్రజా జ్యోతి న్యూస్ -** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని హొళగుంద ఎస్సై దిలీప్ కుమార్ గ్రామస్తులకు సూచించారు. సోమవారం ఇంగలదహాల్ గ్రామంలో నిర్వహించిన ‘పల్లె నిద్ర’ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో సమావేశమై ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడవద్దని అవగాహన కల్పించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా పోలీసులకు సహకరించాలని ఎస్సై దిలీప్ కుమార్ ప్రజలను కోరారు. గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

## పంత్‌కు గాయం.. టీమిండియాలో మార్పు



న్యూజిలాండ్-ఏతో జరగనున్న మూడు మ్యాచ్‌ల అనధికారిక సిరీస్‌కు ముందు భారత-ఏ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ గాయం కారణంగా తొలి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో యువ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుషాగ్రా జట్టులోకి వచ్చాడు. ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌లో పంత్‌కు గాయమైంది. టెస్టు సిరీస్‌కు సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌కు పంత్ ఎంపిక కూడా ఫిట్‌నెస్ అనుమతులకు లోబడే జరిగింది. పంత్ మూడో మ్యాచ్‌లో ఆడటంపై మరో ?ప్రకటన త్వరలో? వెలువడుతుంది. కాగా, న్యూజిలాండ్‌లో టీమిండియా పర్యటనకు ముందు భారత్-ఏ, న్యూజిలాండ్-ఏ జట్ల మధ్య అనధికారిక టెస్ట్ సిరీస్ జరుగనుంది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ అక్టోబర్ 24న, రెండో మ్యాచ్ అక్టోబర్ 31న, మూడో మ్యాచ్ నవంబర్ 7న మొదలవుతాయి.

ఈ సిరీస్ కోసం భారత-ఏ జట్టును కొద్ది రోజుల కిందటే ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా ధ్రువ్ జురెల్ ఎంపికయ్యాడు. ఈ జట్టులో పంత్, జురెల్‌తో పాటు భారత టెస్ట్ జట్టు రెగ్యులర్ సభ్యులు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కూడా అవకాశం దక్కింది.

**అప్‌డేటెడ్ భారత్-ఏ జట్టు**

యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, రవిచంద్రన్ స్మరణ్, ధ్రువ్ జురెల్ (కెప్టెన్, వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, ఔకిబ్ నబీ, ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్, మానవ్ సుతార్, ముఖేశ్ చౌదరి, సాయి సుదర్శన్, యశ్ రాథోడ్, ముఖేశ్ కుమార్, కుమార్ కుషాగ్రా (తొలి రెండు మ్యాచ్‌లకు) ఇదిలా ఉంటే, భారత్, న్యూజిలాండ్-ఏ జట్ల మధ్య సిరీస్ ముగిశాక భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్‌లోని తొలి మ్యాచ్ నవంబర్ 19న మొదలుకానుండగా.. రెండో టెస్ట్ నవంబర్ 27న ప్రారంభం కానుంది. టెస్ట్ సిరీస్‌కు ముందు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య 5 టీ20లు, 5 వన్డేల భారీ సిరీస్‌లు జరుగనున్నాయి.

**సూపర్ ఫామ్‌లో కుషాగ్రా**

21 ఏళ్ల కుషాగ్రా ప్రస్తుతం రెడ్‌బాల్ క్రికెట్‌లో మంచి ఫామ్‌లో ఉన్నాడు. తన చివరి మూడు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో రెండుసార్లు శతకాలు సాధించాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్‌తో పాటు పుదుచ్చేరిలో ఆస్ట్రేలియా-ఏ జట్టుతో జరిగిన మ్యాచ్‌లోనూ సెంచరీ నమోదు చేశాడు.



# డ్యాన్స్ షో ఆఫర్ వస్తే అనుపమ పరమేశ్వరన్ షాకయ్యిందట.. ఎందుకో తెలుసా.. ?

రింగురింగుల జుట్టుతో కుర్రకారు మనసులో చెరగని ముద్రవేసుకుంది కేరళ చిన్నది అనుపమ పరమేశ్వరన్. మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..? కాదండి.. అనుపమకు ఓ పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో నుంచి ఆఫర్ వచ్చింది. తెలుగు రియాలిటీ డ్యాన్స్ షో 'ఢీ' నయా సీజన్‌కు జడ్జిగా చేయాలని ఆఫర్ రావడంతో షాకయ్యానని చెప్పింది అనుపమ. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో అనుపమ మాట్లాడుతూ.. సినిమాలకు అతీతంగా కొత్త అవకాశాలను అన్వేషించడం తనకు ఇష్టమని చెప్పింది. సినిమాలో తన మార్క్ చూపించిన తర్వాత షార్ట్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలు వచ్చాయని... ఢీ షోకు జడ్జిగా చేయాలనే ఆఫర్ వస్తుందని తానెప్పుడు ఊహించలేదని, డిఫరెంట్ ఫార్మాట్లలో ప్రయోగాలు చేయడాన్ని ఎంజాయ్ చేయడం వల్ల తాను షో చేసేందుకు ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది. ఎప్పుడైనా కొంతగా ప్రయత్నించే ఆసక్తికరమైన అవకాశాలు వస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంది అనుపమ. డ్యాన్స్ షోకు జడ్జిగా చేయాలని అనుపమ నిర్ణయించుకోవడం కొత్త అనుభవాలను ఆవిష్కరించుకోవాలనే తన తపనను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా ప్రేక్షకుల దగ్గర అనుపమ ఎలాంటి మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి.



# 'మండాడి' తర్వాత సుహాస్ కొత్త సినిమా ఇదే

మండాడితో మంచి విజయాన్ని అందుకున్న సుహాస్ మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. సుహాస్ ప్రధాన పాత్రలో, రాజేంద్ర బాల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. సంజనా కృష్ణమూర్తి కథానాయిక. కార్తికేయన్ సంతానం, వార్తికా జైన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టైటిల్‌ని 'హైడ్ అండ్ సిల్క్'గా ఖరారు చేసింది చిత్రబృందం. ఈ మేరకు సోషల్ మీడిమాలో టైటిల్ ప్రోమోను విడుదల చేసింది. సుహాస్-సంజన ప్రేమ చిగురించిందని తెలుపుతూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సినిమాలో సుహాస్ సరసన సంజన కృష్ణమూర్తి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తనికెళ్ల భరణి, నందు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాతోనే రాజేంద్ర బాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తెలుగు, తమిళ భాషల్లో త్వరలోనే విడుదల కానుంది.

## ట్వీట్‌తో క్లారిటీ

అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో 'రాకా' చేస్తున్నాడు. దీని తర్వాత లెక్క ప్రకారం లోకేశ్ కనగరాజ్‌తో కలిసి మూవీ చేయాలి. చాన్నాళ్ల క్రితమే ఈ ప్రాజెక్ట్ గురించి ప్రకటన వచ్చింది. అనౌన్స్‌మెంట్ వీడియోని కూడా రిలీజ్ చేశారు. అప్పటినుంచి టీమ్ సైలెంట్ అయిపోయేసరికి మూవీ ఆగిపోయిందని పుకార్లు షికారు చేశాయి. గత కొన్నిరోజుల నుంచి ఈ వార్తలు తెగ వైరల్ అయ్యాయి. దీంతో అంతా ఇది నిజమేనేమో అనుకుంటున్నారు. ఇలాంటి టైంలో ఒక్క ఫొటోతో లోకేశ్ క్లారిటీ ఇచ్చేశాడు. 'ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్ త్వరలోనే' అని ట్వీట్ చేసిన దర్శకుడు లోకేశ్ కనగరాజ్.. బన్నీతో కలిసి మాట్లాడుతున్న లేటెస్ట్ ఫొటోని పోస్ట్ చేశాడు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై వార్తలన్నీ రూమర్స్ అని తేలిపోయాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. అనిరుధ్ సంగీతమందిస్తున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇతర వివరాలు ఏంటనేది టీమ్ నుంచి ప్రకటన రావాల్సి ఉంది.



# సర్దార్ డైరెక్టర్‌తో యశ్ సినిమా.. క్రేజీ టాక్ నిజమయ్యేనా..?

కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు కోలీవుడ్ డైరెక్టర్ పీఎస్ మిత్రన్. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన సీక్వెల్ ప్రాజెక్ట్ సర్దార్ 2 మాత్రం బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయింది. తాజాగా ఈ తమిళ దర్శకుడికి సంబంధించిన క్రేజీ వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. పీఎస్ మిత్రన్ ఇండియానా జోన్స్ ఫ్రాంచైజీ స్ఫూర్తిగా ఓ ఎక్సయిటింగ్ అడ్వెంచరస్ ఫిల్మ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడట. ఇందులో కన్నడ స్టార్ యాక్టర్ యశ్ హీరోగా కనిపించబోతున్నాడట. తాజా టాక్ ప్రకారం పీఎస్ మిత్రన్ యశ్ కథ వినిపించగా.. సినిమా ఐడియా యశ్‌కు బాగా నచ్చిందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో యశ్ చాలా కొత్త గెటప్‌లో కనిపించబోతున్నాడట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఈ ఇద్దరి కాంబో సెట్స్‌పైకి వెళ్లడం పక్కా అని తెలుస్తోందగా.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యశ్ ప్రస్తుతం నితేశ్ తివారి తెరకెక్కిస్తున్న రామాయణ సినిమాలో నటిస్తున్నాడు. ఇందులో రావణుడిగా కనిపించబోతున్నాడు యశ్. దీంతోపాటు యశ్ ప్రస్తుతమున్న ఇతర సినిమాల కమిట్‌మెంట్స్ పూర్తి చేసిన తర్వాత పీఎస్ మిత్రన్ ప్రాజెక్టు ముందుకు కదలనుందనే చర్చ నడుస్తోంది. మరి యశ్-పీఎస్ మిత్రన్ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పైకి రావాలంటే ఎన్నాళ్లు వేచి ఉండాలో మరి.





# మైత్రీ ఇన్ లవ్.. హీరోయిన్‌గా సడన్ సర్‌ప్రైజ్




ఒకప్పుడు హీరోగా ఎన్నో సినిమాలు చేసి ప్రస్తుతం సహాయ నటుడు, విలన్ పాత్రలు చేస్తున్న శ్రీకాంత్.. తన వారసుల్ని ఒక్కొక్కరిగా ఇండస్ట్రీలోకి తీసుకొస్తున్నాడు. ఇప్పటికే కొడుకు రోషన్.. హీరోగా మూడు మూవీస్ చేశాడు. 'ఏమో ఏమో ఇది' అని ఓ చిత్రం చేస్తున్నాడు. మరోవైపు శ్రీకాంత్ కూతురు మేధ కూడా హీరోయిన్ అయిపోయింది. ఈ మేరకు ప్రకటన చేశారు.మైత్రీ మూవీస్ నిర్మాణ సంస్థ తీస్తున్న ఓ ప్రేమకథా సినిమాతో మేధా.. హీరోయిన్‌గా పరిచయమవుతోంది. జై జాస్తి అనే కుర్రాడు హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఇతడు గతంలో 'రాజమండ్రి రోజ్ మిల్క్' అనే మూవీ చేశాడు గానీ అది రిలీజ్ కాలేదు. ఇప్పుడు వీళ్లిద్దరూ రొమాంటిక్‌గా ఉన్న ఓ పోస్టర్ రిలీజ్ చేసి త్వరలో ఇతర వివరాలు వెల్లడించనున్నట్లు చెప్పారు. '30 వెడ్స్ 21' అనే యూట్యూబ్ సిరీస్ తీసిన పృథ్వీ వానం ఈ సినిమాకు దర్శకుడు కాగా 'ఆంధ్రా కింగ్ తాలుకా' మూవీ తీసిన దర్శకుడు మహేశ్ బాబు.. ఈ చిత్రానికి స్టోరీ అందించాడు. శ్రీకాంత్ ఫ్యామిలీలో శ్రీకాంత్ హీరో కాగా ఇతడి భార్య ఊహ కూడా గతంలో హీరోయిన్‌గా చేసింది. ఇప్పుడు వారసుల్ని కూడా ఈ జంట.. ఇండస్ట్రీలోకి తీసుకొస్తున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,